# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 200 | బుధవారం 24 జనవరి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# సీఎం రేవంత్ నజర్



- కొడంగల్‌కు మంచి రోజులు
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత కొడంగల్‌కు నిజాం పాలన నుంచి విముక్తి
- నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతం అన్ని రంగాల్లోనూ వెనుకబాటు
- తెలంగాణ ఏర్పడక ముందు సీమాంధ్ర పాలకులు
- తెలంగాణ వచ్చినా సొంత పాలకులు పట్టించుకోలేదు
- రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారబోతున్నాయి
- కొడంగల్ అభివృద్ధి కోసం కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ను ఏర్పాటు

వాస్తవ నేస్తం, హైదరాబాద్

కొడంగల్‌కు మంచి రోజులు వచ్చాయి. నియోజకవర్గంలోని 8 మండలాల అభివృద్ధిపై రేవంత్ సర్కార్ దృష్టి సారించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాది తర్వాత కొడంగల్‌కు నిజాం పాలన నుంచి విముక్తి లభించింది. నాటి నుంచి నేటి వరకు ఈ ప్రాంతం అన్ని రంగాల్లోనూ వెనుకబాటుకు గురైంది. తెలంగాణ ఏర్పడక ముందు సీమాంధ్ర పాలకులు, తెలంగాణ వచ్చినా సొంత పాలకులు పట్టించుకోలేదు. దీంతో ఈ ప్రాంతానికి విద్య, వైద్యం, రవాణా, ఉపాధి, మౌలిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహించారు. గత పాలకుల వివక్ష వల్ల కొడంగల్‌ను రెండు ముక్కలు చేసి ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చారు. దీంతో ఆగ్రహించిన ప్రజలు మార్పు కోరుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన రేవంత్‌రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఈ ప్రాంత రూపురేఖలు మారబోతున్నాయి. కొడంగల్ అభివృద్ధి కోసం కడా (కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ)ను ఏర్పాటు చేశారు. ఈ అథారిటీ పరిధిలో నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టారు. కడా చైర్మన్‌గా కలెక్టర్ నారాయణరెడ్డి, ప్రత్యేకాధికారిగా వెంకట్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ అభివృద్ధి -మిగతా3లో



## గొర్రెల పంపిణీలో అక్రమాలపై ఏసీబీ కేసు

### గచ్చిబౌలి పీఎస్ లో నమోదైన కేసు టేకోవర్

### రెండు మూడు రోజుల్లో విచారించేందుకు అధికారుల ఏర్పాట్లు

### ఎఫ్ఐఆర్ లో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ల పేర్లు

వాస్తవ నేస్తం, హైదరాబాద్

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) హయాంలో తెలంగాణలో ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకంపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసు నమోదు చేసింది. ఈ పథకంలో అక్రమాలు జరిగాయని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసును టేకోవర్ చేసింది. ఈ ఎఫ్ఐఆర్ ఆధారంగా సోమవారం కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ మీడియాకు వెల్లడించారు. కేసు దర్యాప్తును మొదలు పెట్టామని, -మిగతా3లో

## ప్రతిపక్షాలవి తొందరపాటు విమర్శలు

- ఫిబ్రవరి నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీ అమలు:
- కేసీఆర్ సర్కార్ వల్ల తెలంగాణ అప్పులపాలైంది
- అందువల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోంది
- రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.
- వచ్చే నెల నుంచే 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం
- శుభవార్త చెప్పిన తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి
- ఇచ్చిన హామీలను వంద రోజుల్లో నెరవేర్చుతామని పునరుద్ఘాటన
- హామీల అమలుపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదు
- తెలంగాణను గత బీఆర్ఎస్ అప్పులపాలు చేసిందని విమర్శలు
- అందుకే హామీల అమలు జాప్యం అవుతోందని స్పష్టీకరణ




వాస్తవ నేస్తం, హైదరాబాద్

వచ్చే ఫిబ్రవరి నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తామని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆరు గ్యారెంటీల అమలుపై కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ సమావేశమైంది. మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్ బాబు, కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ, ఇతర సభ్యులు పాల్గొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు.. వాటి అమలుపై కమిటీ చర్చించింది. అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... వంద రోజుల్లో తాము ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చుతామని స్పష్టం చేశారు. కేసీఆర్ సర్కార్ నిర్వాకం వల్ల తెలంగాణ అప్పులపాలైందన్నారు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. అందువల్లే ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో జాప్యం జరుగుతోందన్నారు. ఫిబ్రవరి నెల నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు హామీ అమలు చేస్తామని చెప్పారు. నిరుద్యోగ భృతి మొదలుకొని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వరకు అన్ని హామీలను గత ప్రభుత్వం -మిగతా3లో

## కొత్త బస్సులు ఎప్పుడు?

- ‘మహాలక్ష్మి’పథకంతో 100శాతం దాటుతున్న ఆక్యుపెన్సీ
- పాత బస్సులు కావడంతో ఓవర్ లోడ్‌తో అదుపు తప్పుతాయన్న ఆందోళన
- కొత్త బస్సులు సమకూర్చుకునే ప్రక్రియలో తీవ్ర జాప్యం
- నిధుల లేమితో ఆర్టీసీకి ఇబ్బందులు..
- సర్కారు సాయం, పూచీకత్తు రుణాలపైనా అస్పష్టత




వాస్తవ నేస్తం, హైదరాబాద్

రాష్ట్రంలో ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 100 శాతానికిపైగా ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతోంది. ‘మహాలక్ష్మి’పథకంతో ఉచిత ప్రయాణం నేపథ్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. ఈ పథకం విజయవంతంగా నడుస్తున్నా.. మరోవైపు ఇదే తీవ్ర ఆందోళనకూ కారణమవుతోంది. ఇప్పుడున్న ఆర్టీసీ బస్సుల్లో చాలా వరకు పాతబడ్డాయి. కొన్ని అయితే డొక్కుగా మారాయి. అలాంటి బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసి నడిస్తే ఎక్కడ అదుపు తప్పుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు బస్సుల్లోని సీట్లలో చాలా వరకు మహిళలతో నిండిపోతుండటంతో.. పురుషులకు సీట్లు దొరక్క -మిగతా3లో



## అయోధ్యలో... భక్తుల కిటకిట

- జేబుదొంగల చేతివాటం!
- జన్మభూమిలో కొలువైన బాలరాముడు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రద్దీగా మారిన అయోధ్య
- 3 లక్షల మంది భక్తులకు బాలరాముడి దర్శనం
- రామమందిరం వద్ద 8,000 మందికి పైగా భద్రతా సిబ్బంది
- బాలరాముడి దర్శనం కోసం వేచి చూస్తున్న మరో 3 లక్షలమంది భక్తులు

## ఫిబ్రవరి చివర్లో రేషన్ దరఖాస్తులు

- మళ్లీ ‘మీసేవ’ల వద్ద క్యూ కట్టాల్సిందే!
- అప్లికేషన్ల స్వీకరణకు సివిల్‌సప్లయ్ కసరత్తు
- అభయహస్తంతో సంబంధం లేకుండానే




వాస్తవ నేస్తం, హైదరాబాద్

కొత్త రేషన్‌కార్డుల కోసం ఫిబ్రవరి నెలాఖరులో దరఖాస్తులను తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే కొత్త రేషన్‌కార్డుల కోసం ఆరు గ్యారెంటీల దరఖాస్తులతోపాటు విడిగా దరఖాస్తు తీసుకున్నారు. కానీ, వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిసింది. గతంలో మాదిరిగానే మీ సేవ ద్వారా దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) -మిగతా3లో

# కోవిడ్‌ను మించిన వ్యాధి మనల్ని కబళిస్తుందా?

మొన్నటి వరకూ ప్రపంచాన్ని కోవిడ్–19 వణికించింది. దీని నుంచి కాస్త దూరవుతున్నామనేంతలోనే ఇప్పుడు మరొక ప్రాణాంతక వ్యాధి సమస్త మానవాళిని చుట్టుముట్టేలా ఉంది. ప్రపంచవ్యాప్తంగా త్వరగా వ్యాపించగల ఈ కొత్త వ్యాధికి 'డిసీజ్ ఎక్స్' అనే పేరు పెట్టారు. కరోనా మాదిరిగానే ఈ వ్యాధి కూడా మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తుంది. ప్రాణాలను కూడా మింగేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2016లోనే ఈ వ్యాధి పేరును మొదటిసారి ప్రకటించింది. భవిష్యత్తుకు ముప్పుగామారిన ఈ వ్యాధి విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తీవ్రంగా హెచ్చరించింది. 2019లో కోవిడ్–19 వేగంగా వ్యాపించడం వల్ల అనేక దేశాలలో బాధితులకు సహాయం చేయడానికి తగినంత మంది వైద్యులు, నర్సులు, మందులు, పరికరాలు అందుబాటులో లేక అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇప్పటికీ కోవిడ్–19 ప్రపంచానికి పెద్ద సమస్యగానే ఉంది. కొందరు శాస్త్రవేత్తలు డిసీజ్ ఎక్స్ వ్యాధి నుంచి మానవాళిని రక్షించేందుకు వ్యాక్సిన్లను తయారు చేసేందుకు కృషి చేస్తున్నారు. కోయలిషన్ ఫర్ ఎపిడెమిక్ ప్రిపేర్డ్‌నెస్ ఇన్నోవేషన్స్ అనే గ్రూప్ వ్యాక్సిన్ తయారీకి కృషిచేస్తోంది. ఇందుకోసం కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నారు. ఈ కొత్త వ్యాధి గురించి సమగ్రంగా తెలుసుకున్న తర్వాత వ్యాక్సిన్లను తయారీ సులభమవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**అంచనాలకు అందని డిసీజ్ ఎక్స్**

డిసీజ్ ఎక్స్ ఎంత ఘోరంగా ఉండనుందో ఇప్పటికీ శాస్త్రవేత్తలు అంచనావేయలేకపోతున్నారు. ఇది తేలికపాటి జలుబు మాదిరిగా ఉండవచ్చు లేదా కోవిడ్–19 కంటే చాలా




ప్రాణాంతకం కావచ్చని వారు భావిస్తున్నారు. ఏ సూక్ష్మక్రిమి దీనికి కారణంగా నిలుస్తున్నదో, దానిని ఏ విధంగా కనుగొనాలో, ఎటువంటి చికిత్స అందించాలో వైద్యులకు కూడా అంతుచిక్కడం లేదు. అందుకే ఈ వ్యాధి విషయంలో అప్రమత్తత అవసరం అని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. డిసీజ్ ఎక్స్ వ్యాధి సోకిన బాధితుడు దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు ఆ డ్రాప్స్ ద్వారా వ్యాధి వ్యాపించవచ్చు. బాధితుడు తాకిన వస్తువులపై నిలిచిన సూక్ష్మక్రిములు ద్వారానూ ఈ వ్యాధి సంక్రమించవచ్చు. ఈ వ్యాధి క్రిములను మోసే కీటకాల నుంచి కూడా వ్యాప్తి చెందవచ్చుంటున్నారు వైద్య శాస్త్రవేత్తలు.

**జంతువుల నుంచి..**

డిసీజ్ ఎక్స్ అనేది కోతులు, కుక్కలు తదితర జంతువుల నుంచి మానవులకు సంక్రమించే వ్యాధి అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే దీనిపై పూర్తి స్థాయిలో సమాచారం లేదు. ఒకరకంగా చెప్పాలంటే ఇది ఒక ఊహాజనిత వ్యాధి. దీని కారణంగా ప్రపంచం మొత్తం మీద తీవ్రమైన అంటువ్యాధులు సంభవించే అవకాశం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. రాబోయే కాలంలో జంతువుల నుంచి మానవులకు సోకే పలు రకాల వ్యాధుల్లో ఇదీ ఒకటి కానుంది. అంటువ్యాధులను వ్యాప్తి చేయడంలో ఇది కీలక పాత్ర పోషించనుందని ప్రపంచ ఆరోగ్యం సంస్థ చెబుతోంది. ప్రస్తుతం వ్యాప్తిలో ఉన్న పలు వైరస్‌లు గతంలో కంటే వేగంగా రూపాంతరం చెందుతున్నాయని, ఇవి మనుషులపై తీవ్ర ప్రభావం చూపించవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. వాటిలో ఏదైనా వైరస్ మహమ్మారిగా రూపాంతరం చెందవచ్చని కూడా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. డిసీజ్ ఎక్స్ సోకినపుడు బాధితునికి జ్వరం, నరాల తిమ్మిరి, మెడ నొప్పి, వెన్నునొప్పి, తలనొప్పి, గొంతు నొప్పి, వాంతులు, విరేచనాలు, వికారం, మూర్ఛ వంటి లక్షణాలు కనిపించవచ్చు. ఈ వ్యాధి వ్యాపిస్తే కోవిడ్‌ను మించిన ప్రమాదం వాటిల్లవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. అందుకే ప్రతీఒక్కరూ పరిశుభ్రత, పోషకాహారం విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

# రాహుల్ యాత్రను అడ్డుకున్న పోలీసులు

**గువాహటి:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో న్యాయ యాత్ర'ను అస్సాం పోలీసులు అడ్డుకోవడంతో రాష్ట్ర రాజధాని గువాహటి ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. 500 మంది కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి రాహుల్ మంగళవారం ఉదయం గువాహటి సిటీలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే కాంగ్రెస్ ర్యాలీ గువాహటి రోడ్లపైకి రాకుండా అడ్డుకునేందుకు రాష్ట్ర పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేశారు. అయినా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటుకొని కార్యకర్తలు దూసుకురావడంతో వారిని నిలువరించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ సమయంలో రాహుల్ గాంధీ అక్కడే ఉన్నారు.

**రూట్ చేంజ్ చేసుకోండి: సీఎం**

అంతకుముందు గువాహటి రోడ్లపై రాహుల్ యాత్రకు సీఎం హిమంత బిస్వా శర్మ ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. వర్కింగ్ డే రోజు కావడంతో కీలక నగరమైన రహదారులపై యాత్రను అనుమతించడం వల్ల ట్రాఫిక్ జామ్ అవుతుందని తెలిపింది. ఈ మార్గానికి బదులుగా ర్యాలీని దిగువ అస్సాం దిశగా జాతీయ రహదారి మార్గంలో చేపట్టాలని సూచించింది. నగరం చుట్టూ రింగ్ రోడ్డుపై ఉన్న 27వ నెంబరు జాతీయ రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు వెళ్లాలని కోరింది.

**చట్టాన్ని ఉల్లంఘించలేదు:రాహుల్**

దీనిపై రాహుల్ ఘాటుగా స్పందించారు. గతంలో భజరంగ్ దళ్ ఇదే మార్గంలో నడిచిందని, అంతేగాక బీజేపీ చీఫ్ జేపీ నడ్డా కూడ ఇదే రూట్‌లోర్యాలీ చేపట్టారని గుర్తు చేశారు. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు రాలేదా అని ప్రశ్నించారు.





అయితే పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్‌లను దాటుకొని వచ్చామన్న రాహుల్.. తాము చట్టాన్ని ఉల్లంఘించలేదని తెలిపారు. తామను బలహీనులుగా భావించవద్దని హెచ్చరించారు. ఇది కాంగ్రెస్ కార్యకర్తల శక్తికి నిదర్శనమన్నారు.

**రాహుల్‌పై కేసు నమోదుకు సీఎం ఆదేశం**

గువాహటి సరిహద్దుల్లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ కార్యకర్తల ప్రవర్తనపై అస్సాం సీఎం హిమంత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. ఘర్షణలు జరిగేలా కార్యకర్తలను రెచ్చగొట్టినందుకు గానూ కేసు ఫైల్ చేయాలని ఆదేశించారు. కాంగ్రెస్ తమ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసిన వీడియోలనే సాక్ష్యాలుగా పరిగణించాలని చెప్పినట్లు తెలిపారు. అస్సాం ప్రజలను ప్రభుత్వం అణచివేస్తోందని రాహుల్ ఆరోపించారు. మేఘాలయాలో విద్యార్థులతో తన ఇంటరాక్ట్‌ను రద్దు చేశారని ప్రస్తావించారు. విద్యార్థులు నన్ను కలిసేందుకు అధికారులు అనుమతి ఇవ్వలేదన్న కాంగ్రెస్ నేత.. అయినప్పటికీ వారు తనను కలవడానికి బయటికి వచ్చినట్లు తెలిపారు. ఇకర అస్సాంలోని 17 జిల్లాల మీదుగా 833 కి.మీ. మేర జనవరి 25 వరకు రాహుల్ యాత్ర కొనసాగనుంది.

# అయోధ్యలో... భక్తుల కిటకిట

అయోధ్యలో బాలరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి నిన్న వేలాది మంది తరలి వచ్చారు. దేశం నలుమూలల నుంచి ప్రముఖులు, సాధువులు, రామ భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అయోధ్య కిటకిటలాడిపోయింది. ఇక ఈ రోజు సామాన్య జనానికి దర్శనానికి అనుమతించడంతో మరింతగా జనం కిక్కిరిసిపోయారు. ఇదే అదనుగా జేబుదొంగలు రెచ్చిపోతూ, తమ చేతివాటం ప్రదర్శించారు. అయోధ్య వీధుల్లో ఏర్పడిన రద్దీని అవకాశంగా ఉపయోగించుకున్న జేబుదొంగలు... హ్యాండ్ బ్యాగులను, జేబులను లక్ష్యంగా చేసుకుని యథేచ్ఛగా తమ పనితనాన్ని ప్రదర్శించారు. ముఖ్యంగా, రామ మందిరంలోకి ప్రవేశించే గేట్ల వద్ద భారీ జనసమూహాలు గుమికూడడంతో, జేబుదొంగల పని బాగా సులువైంది. గత రాత్రి నుంచి ఆలయ ప్రవేశం కోసం వేచి ఉన్న భక్తులు, ఈ రోజు ఉదయం 7 గంటలకు గేట్లు తెరిచేసరికి ఒక్కసారిగా తోసుకుని వచ్చారు. ఇదే అదనుగా జేబుదొంగలు విజృంభించారు. పాపం... కెనడా నుంచి వచ్చిన పూర్ణిమ అనే భక్తురాలు తన హ్యాండ్ బ్యాగులో విలువైన వస్తువులు, డబ్బు పోయిన విషయం గుర్తించి లబోదిబోమన్నారు. ఆమె స్నేహితురాలు ప్రాప్తి కూడా జేబుదొంగల బాధితురాలయ్యారు. స్నేహితురాలికి తోడుగా అయోధ్య వచ్చిన ప్రాప్తి కూడా విలువైన వస్తువులు పోగొట్టుకున్నారు. ఆమె స్లింగ్ బ్యాగ్ జిప్ తెరిచిన జేబుదొంగలు ఏటీఎమ్ కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతర పత్రాలను ఎత్తుకెళ్లారు. వీళ్లిద్దరే కాదు... అయోధ్యలో అనేక మంది భక్తులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు.

**3 లక్షల మంది భక్తులకు బాలరాముడి దర్శనం**



అయోధ్య బాలరాముడిని మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దాదాపు 3 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ నిన్న జరిగింది. దీంతో రాములవారిని చూసేందుకు అయోధ్యకు దేశం నలుమూలల నుంచీ భక్తులు తరలి వస్తున్నారు. అయోధ్య రామమందిరం వద్ద 8,000 మందికి పైగా భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇప్పటికిప్పుడు రాముడి దర్శనానికి రావొద్దని.. కాస్త సమయం తీసుకోవాలని ఆలయ పూజారులు, అధికారులు విజ్ఞప్తి చేశారు. నేటి నుంచి శ్రీరాముడి దర్శనానికి సాధారణ భక్తులకు అనుమతిస్తున్నారు. దీంతో బాలరాముడిని చూసేందుకు భక్తులు వరుస కడుతున్నారు. ఈ రోజు తెల్లవారుజామున 3 గంటలకే రాములోరి గుడి తెరుచుకుంది. 7 గంటల నుంచి భక్తులను అనుమతించారు. ఉదయం 2.5 నుంచి 3 లక్షల మంది దర్శించుకోగా... మరో 3 లక్షల మంది దర్శనం కోసం వేచి చూస్తున్నారు.

## అయోధ్య బాల రాముడి పేరు మార్పు..

ఇకపై ఈ పేరుతో పిలుస్తారు!

రామ్ లల్లా పేరు బాలక్ రామ్ గా మార్పు

ఆలయాన్ని బాలక్ రామ్ మందిర్ గా పిలుస్తామన్న ట్రస్ట్ పూజారి

గర్భగుడిలో కొలువుదీరిన రాముడి వయసు ఐదేళ్లని వెల్లడి



అయోధ్యలోని రామ మందిరంలో బాల రాముడు కొలువుదీరిన సంగతి తెలిసిందే. గర్భగుడిలో నిన్న జరిగిన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని చూసి యావత్ దేశం పులకించింది. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అక్కడ కొలువైన బాల రాముడిని ఇప్పటి వరకు రామ్ లల్లా అని పిలిచారు. ఇప్పుడు బాల రాముడి పేరును మార్చారు. ఇకపై రామ్ లల్లాను 'బాలక్ రామ్'గా పిలవనున్నట్లు ట్రస్ట్ పూజారి అరుణ్ దీక్షిత్ తెలిపారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీరాముడు ఐదేళ్ల పసిబాలుడని... అందుకే బాలక్ రామ్ పేరును నిర్ణయించామని చెప్పారు. ఇకపై ఆలయాన్ని బాలక్ రామ్ మందిర్ గా పిలుస్తామని తెలిపారు. మరోవైపు, స్వామికి రోజుకు ఆరుసార్లు హారతిని ఇస్తామని ట్రస్ట్ కు చెందిన ఆచార్య మిథిలేశ్ నందిని తెలిపారు. మంగళ, శ్రింగార, భోగ, ఉతపన్, సంధ్యా, శయన హారతి ఇస్తామని చెప్పారు. పూరి, కూరతో పాటు పాలు, పండ్లు, రబ్ డీ ఖీర్, పాలతో చేసిన స్వీట్లను నైవేద్యంగా సమర్పిస్తామని తెలిపారు. ఈరోజు నుంచి బాల రాముడి దర్శనానికి సామాన్య ప్రజలను అనుమతించారు. దీంతో, ఆలయం దేశం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో కిటకిటలాడుతోంది.

## పాకిస్థాన్‌లో ఘోరం.. ఇమ్రాన్ ఖాన్ పార్టీ జెండాను ఎగరేశాడని కొడుకుని హతమార్చిన తండ్రి

పెషావర్ శివార్లలో చోటుచేసుకున్న ఘటన

కొడుకుపై పిస్టల్ తో కాల్పులు జరిపిన తండ్రి

ఇటీవలే ఖతార్ నుంచి తిరిగొచ్చిన కొడుకు



పాకిస్థాన్ లో ఎన్నికలు జరగనున్న తరుణంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పార్టీ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ పార్టీ జెండాను ఎగరేశాడని కన్న కొడుకుని తండ్రి హతమార్చాడు. ఖైబర్ ఫఖ్తూంఖ్వా ప్రావిన్స్ లోని పెషావర్ శివార్లలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తమ ఇంటి ఎదురుగా తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ జెండాను ఎగురవేసిన కొడుకుని తండ్రి వారించాడు. తండ్రి మరో పార్టీ మద్దతుదారుడు కావడమే దీనికి కారణం. ఈ క్రమంలో ఇద్దరికీ వాగ్వాదం జరిగింది. అయితే, జెండాను తొలగించేందుకు కొడుకు నిరాకరించాడు. ఈ క్రమంలో వాగ్వాదం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆగ్రహం పట్టలేని తండ్రి తన 31 ఏళ్ల కొడుకుని పిస్టల్ తో కాల్చాడు. గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు విడిచాడు. కొడుకుపై కాల్పులు జరిపిన వెంటనే తండ్రి అక్కడి నుంచి పరారయ్యాడు. ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఖతార్ లో పని చేస్తున్న మృతుడు ఇటీవలే స్వదేశానికి తిరిగొచ్చాడు. ఫిబ్రవరి 8 పాకిస్థాన్ లో ఎన్నికలు జరగనున్నాయి.

## భారత సైనికులతో కలిసి 'జైశ్రీరామ్' నినాదాలు చేసిన చైనీస్ ఆర్మీ

వాస్తవాధీన రేఖ వద్ద ఘటన

చైనా సైనికుల జైశ్రీరామ్ నినాద వీడియోను షేర్ చేసిన మాజీ సైనికుడు

జైశ్రీరామ్ అని ఎలా ఉచ్ఛరించాలో చైనా సైనికులకు చెబుతున్న భారత సైనికులు



500 సంవత్సరాల అయోధ్య రామమందిర కల జనవరి 22, 2024న నెరవేరింది. భారత్‌లోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా హిందువులు రాముడి ఆలయం కోసం వేయి కళ్లతో ఎదురు చూశారు. నిన్న బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఘట్టాన్ని చూసిన హిందువులు మంత్రముగ్ధులయ్యారు. భారత్‌లో ప్రతి గ్రామంలో రాముడి పండుగ కనిపించింది. సోషల్ మీడియాలో జైశ్రీరామ్ నినాదం వినిపించింది. ఇదిలావుంచితే, వాస్తవాధీన రేఖ వద్ద భారత సైనికులతో పాటు చైనా సైనికులు కూడా జైశ్రీరామ్ నినాదాలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఓ టేబుల్‌పై డ్రింక్స్, స్నాక్స్ ఉండగా ఇరువైపులా రెండు దేశాల సైనికులు నిలబడి ఉన్నారు. భారత దళాలు... చైనీస్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ దళాలకు జైశ్రీరామ్ నినాదాన్ని ఎలా పలకాలో చెబుతున్నట్లుగా వీడియోలో ఉంది. భారత ఆర్మీ పలికినట్లుగా చైనా సైనికులు జైశ్రీరామ్ నినాదం ఇచ్చారు. అయితే ఈ వీడియో ఎప్పటిదన్నది స్పష్టంగా తెలియరాలేదు. కానీ మూడు నెలల కిందటిగా భావిస్తున్నారు. భారత్–చైనా సరిహద్దుల్లో కొన్నేళ్లుగా ఉద్రిక్తతలు ఉన్న విషయం తెలిసిందే. సమస్య పరిష్కారం కోసం ఇరుదేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఈ క్రమంలో ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజున ఈ వీడియోను ఓ మాజీ సైనికుడు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.

## రన్‌వేపై జారిపడిన మయన్మార్ సైనిక విమానం.. ఎనిమిది మందికి గాయాలు

**ఐజ్వాల్:** మిజోరంలో మయన్మార్ ఆర్మీకి చెందిన ఓ విమానం ప్రమాదానికి గురైంది. మయన్మార్ నుంచి వచ్చిన సైనిక విమానం రన్‌వేపై దిగుతుండగా అదుపు తప్పి కొంత దూరంలో ఉన్న పొదల్లోకి దూసుకెళ్లింది. మిజోరాంలోని లెంగ్‌పుయ్ విమానాశ్రయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎనిమిది మంది మయన్మార్ సిబ్బంది గాయపడ్డారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో విమానంలో 13 మంది ఉన్నట్లు తెలుస్తోంది. తమ దేశంలో జరుగుతున్న అతర్యుద్ధం కారణంగా సరిహద్దుల దాటి భారత్‌లోని మిజోరం రాష్ట్రంలోకి చొరబడిన మయన్మార్ సైనికులను స్వదేహానికి తీసుకెళ్లేందుకు ఈ విమానం వచ్చిన సమయంలో ప్రమాదం జరిగింది. కాగా టేబుల్‌టాప్ రనేవేలు (పీఠభూమి లేదా ఎత్తైన కొండ పైభాగం ప్రాంతాల్లో నిర్మించిన రన్‌వే) సవాలుతో కూడుకొని ఉన్నాయి. ఇలాంటి రన్‌వేలో భారత్‌లో ఆరు మాత్రమే ఉన్నాయి. వీటి వల్ల విమానాలు ల్యాండింగ్ అవుతున్న సమయాల్లో రన్‌వే నుంచి జారిపోయే ప్రమాదం ఉంటుంది. ఇక మయన్మార్‌లో తిరుగుబాటు గ్రూపులతో జరుగుతోన్న తీవ్ర ఘర్షణల నేపథ్యంలో ఆ దేశం నుంచి భారీగా సైనికులు భారత్‌లోకి చొరబడుతున్న విషయం తెలిసిందే.

# ప్రతిపక్షాలవి తొందరపాటు విమర్శలు

-మొదటి పేజి తరువాయి

విస్మరించిందని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదన్న మంత్రి.. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు అన్ని అక్రమాలపై విచారణ కొనసాగుతుందని తెలిపారు.

**కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ భేటీ**

మంగళవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సమావేశమైంది. మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంచార్జ్ దీపదాస్ మున్షి , ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ కమిటీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఏఐసీసీ మ్యానిఫెస్టోలో తెలంగాణ నుంచి చేర్చాల్సిన అంశాలపై చర్చించారు.
అన్ని రాష్ట్రాల్లో తిరిగి అభిప్రాయాలను సేకరిస్తున్న కేంద్ర మేనిఫెస్టో కమిటీ.. తెలంగాణ మేనిఫెస్టో కమిటీ నుంచి కూడా అభిప్రాయాలను సేకరించింది. నాలుగైదు కామన్ స్కీములతో పాటు.. రాష్ట్రాల కోసం ప్రత్యేక అంశాలను మేనిఫెస్టోలో పెట్టాలని కాంగ్రెస్ నిర్ణయం నిర్ణయించింది.

**ప్రతిపక్షాలవి తొందరపాటు విమర్శలు**

మేనిఫెస్టోతోనే తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిందని అన్నారు పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఎంతో విశ్వాసాన్ని చూపారని అన్నారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న విమర్శలు చాలా తొందరపాటుగా ఉన్నాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు



చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
ఉచిత బస్సు ప్రయాణంతో పాటు పలు హామీలు నెరవేర్చామని, మిగతా వాటిని గడువులోగా అమలు చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. వచ్చే నెల నుంచి ఉచిత విద్యుత్ పథకం అమలు చేస్తామన్నారు. హామీల అమలుపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందన్నారు.

**ఏఐసీసీ మ్యానిఫెస్టోకు టీ కాంగ్రెస్ సాయం తీసుకుంటాం**

మేనిఫెస్టో అంటే ప్రజలకు దగ్గరగా, అమలుకు నోచుకునే విదంగా ఉండాలని ఏఐసీసీ ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. తెలంగాణలో మంచి మేనిఫెస్టో అందించారని.. అందుకే రాష్ట్ర ప్రజలు విశ్వసించారని పేర్కొన్నారు. ఏఐసీసీ మేనిఫెస్టో కేంద్ర మాజీ మంత్రి చిదంబరం నేతృత్వంలో రూపొందుతుందని చెప్పారు. మ్యానిఫెస్టో పబ్లిక్ ఫ్రెండ్లీగా, క్రోని కాపిటల్‌కు దూరంగా ప్రజావసరాలకు దగ్గరకు ఉండాలన్నారు. ఏఐసీసీ మ్యానిఫెస్టోకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సహకారం తీసుకుంటామన్నారు.

# సీఎం రేవంత్ నజర్..

-మొదటి పేజి తరువాయి

పనులకు శాఖల వారీగా సిద్ధం చేసిన ప్రతిపాదనలను మంగళవారం కడా ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సమర్పించే అవకాశం ఉంది. కొడంగల్, కోస్గి ఆస్పత్రులను 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేయనున్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు. గురుకులాలు, పాఠశాలలకు ప్రభుత్వ స్థలాలను గుర్తిస్తున్నారు. జీఓ 69తో కొడంగల్, నారాయణపేట, మక్తల నియోజకవర్గాలకు సాగునీరు అందించనున్నారు. ఇప్పటికే స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. కొడంగల్‌ను రెవెన్యూ డివిజన్‌గా, మద్దూరును మున్సిపల్‌గా అప్‌గ్రేడ్ చేయనున్నారు. వికారాబాద్ %--% కృష్ణా రైల్వే లైన్‌కు లైన్ క్లియర్ కానుంది. ఇప్పటికే సీఎం రేవంత్ ఆ శాఖ అధికారులతో చర్చించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించాలని ప్రభు త్వం అధికారులను ఆదేశించింది. నియోజకవర్గానికి వ్యవసాయ డిప్లమో కళాశాల, 50 ఎకరాల్లో ఉద్యానవన పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయడానికి అధికారులు కృషి చేస్తున్నారు. కొడంగల్ బస్టాండ్ విస్తరణపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. కోస్గి ఆర్టీసీ బస్సు డిపోకు జవసత్వాలు పోయనున్నారు. ప్రస్తుతం 10 ఆర్డినరీ, ఒక ఎక్స్‌ప్రెస్ బస్సుతో డిపోను నడిపిస్తున్నారు. త్వరలో కోస్గి డిపో స్థాయిని పెంచే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కోస్గిలో




ఇంజనీరింగ్ కళాశాల, కొడంగల్‌లో పీజీ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచనలో సర్కార్ ఉంది. నియోజకవర్గంలో మూసి వేసిన ప్రభుత్వ పాఠశాలలను తిరిగి ప్రారంభించడానికి కృషి జరుగుతోంది. ప్రతి గ్రామం, తండాలో ప్రభుత్వ పాఠశాల ఉండాలని రేవంత్ కృతనిశ్చయంతో ఉన్నట్లు సమాచారం.

# పార్లమెంట్ ఎన్నికల్లో చేతికి పతంగ్

హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికలపై వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది కాంగ్రెస్ పార్టీ. లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి టీంలో సడెన్‌గా అక్బరుద్దీన్ ఓవైసీ ప్రత్యక్షమవడం పొలిటికల్ వర్గాల్లో చర్చకు దారి తీసింది.రాజకీయంగా ఎంఐఎం పార్టీని దగ్గర చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోందని పొలిటికల్ గా డిస్కషన్ జరుగుతుంది. అందులో భాగంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అక్బర్‌ని కాంగ్రెస్ ప్రొటెం స్పీకర్‌గాఎన్నుకుంది.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్‌లో భారతీయ మూలాలున్న బ్రిటిష్ పార్లమెంట్ మెంబర్లతో సమావేశమయ్యారు. చారిత్రాత్మకమైన వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్‌లో జరిగిన ఈ భేటీ ఈ సందర్భంగాముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 'భారత్, బ్రిటన్ మధ్య బలమైన బంధం ప్రజాస్వామ్యమే. ఇప్పుడు ప్రపంచం ఎదుర్కుంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచడమే అత్యవసరం'అన్నారు.యునెస్కో 1016 సంవత్సరంలోనే లండన్ లోని వెస్ట్ మినిస్టర్ ప్యాలెస్ ను ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఈ చారిత్రక భవనంలోనే ఈ సమావేశం జరిగింది. లేబర్ పార్టీ ఎంపీ వీరేంద్ర శర్మతో పాటుమరో ఏడుగురు ఎంపీలు, ఉన్నత స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. అయితే రేవంత్ రెడ్డి టీంలో అక్బరుద్దీన్ ఓవైసీ ప్రత్యక్షమవడం పొలిటికల్ వర్గాల్లో చర్చకు దారితీసింది. థీమ్స్ నది నిర్వహణపై అధ్యయనం చేసి మూసీ




నది ప్రక్షాళనలో అమలు చేయాలనేది సీఎం మీటింగ్ సారాంశం. అయితే గతంలో మూసీ నది ప్రక్షాళన చేసి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో కమర్షియల్ సర్క్యూట్ డిజైన్ చేయాలని జరిపిన సమీక్షలో, పాతబస్తీకి మెట్రో ను విస్తరించే సమీక్షలో పాత బస్తికి చెందిన ఎంఐఎం నేతలు కూడా పాల్గొన్నారు. ఇప్పుడు లండన్ పర్యటనకి అక్బరుద్దీన్ కి అధికారికంగాఆహ్వానందినట్లుగా సమాచారం.ఇక లండన్ పర్యటనలో ఈఇద్దరు నేతలు కలిసి పాల్గొనడం చూస్తుంటే తెలంగాణ రాజకీయాల్లో పార్టీల మధ్య ఏం జరుగుతుందనే ఆలోచన మొదలైంది. మూసీ ప్రక్షాళన అంశం మాటునఓఎఓ కాంగ్రెస్ మధ్య మైత్రి జరగబోతోందని ఎంపీ ఎలక్షన్ల నేపథ్యంలో రేవంత్.. ఎంఐఎంను కలుపుకునే ప్రయత్నం చేస్తున్నరనే టాక్ వినిపిస్తుంది. లండన్ లో అక్బరుద్దీన్, రేవంత్ మధ్య ఏం చర్చ జరిగిందనేదిఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాజకీయంగా ఎంఐఎం పార్టీని దగ్గర చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ చూస్తోందని పొలిటికల్ గా డిస్కషన్ జరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రోటీన్ స్పీకర్ గాఎన్నుకున్నారు. ఆ తర్వాత అక్బరుద్దీన్ కొన్ని వ్యాఖ్యలు కూడా చేశారు. అక్బర్ నీ కాంగ్రెస్ ప్రొటెం స్పీకర్ గా ఎన్నుకోవడం ఆ తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో ఎంఐఎం వర్సెస్ కాంగ్రెస్ గా వాడి వేడి చర్చలు జరగటం.ఇప్పుడు అక్బరుద్దీన్ సీఎం లండన్ పర్యటనలో కలిసి పాల్గొనడం అన్ని చూస్తుంటే తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీల మధ్య ఏం జరుగుతుందనే ఆలోచన మొదలైంది.మరోవైపు పార్లమెంట్ ఎన్నికలపై తగ్గేదేలేఅంటున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. మెజార్టీ స్థానాలు సాధించి తీరుతామంటున్నారు. అధికారం పోయినా బీఆర్ఎస్‌కు అహంకారం తగ్గలేదన్నారు సీఎం రేవంత్. పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించి..బీఆర్ఎస్‌గుర్తు లేకుండా చేస్తామని లండన్ వేదికగా ఫైరయ్యారు రేవంత్‌రెడ్డి. వంద మీటర్ల లోతులో పాతిపెడతామన్నారు.లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఓఎఓ సపోర్టుతో ముందుకెళ్లాలని భావిస్తోందా..? అదే జరిగితే అసెంబ్లీఎన్నికల మాదరిగే..లోక్‌సభ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలు గెలవాలని యోచిస్తోంది. మొత్తానికి అక్బరుద్దీన్‌తో సీఎం కలిసి పాల్గొనడం.. లండన్ పాలిటిక్స్ వ్యూహం ఏంటనేది హాట్ టాపిక్‌గా మారింది

## ఫిబ్రవరి చివర్లో రేషన్ దరఖాస్తులు..

-మొదటి పేజి తరువాయి




ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు రేషన్‌కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటున్నది. రాష్ట్రంలో చాలా మందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో వారంతా ఆందోళన చెందుతు న్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని ప్రభు త్వం నిర్ణయించినట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉండ గా 2.86 కోట్ల మంది లబ్ధిదారులన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 6.5 లక్షల కొత్త రేషన్‌కార్డులను జారీ చేసింది. తద్వారా సుమారు 20 లక్షల మందికి లబ్ధి జరిగింది.

## కొత్త బస్సులు ఎప్పుడు?



-మొదటి పేజి తరువాయి

ప్రైవేటు వాహనాల వైపు మొగ్గుతున్నారన్నదీ ఆందోళన రేపుతోంది. కొత్త బస్సులు అందుబాటులోకి వస్తే.. ఈ రెండు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అధికారవర్గాలు చెప్తున్నాయి. కానీ ఎన్ని బస్సులు కొందాం, ఏ కేటగిరీలో ఎన్ని ఉండాలన్న ప్రతిపాదనలు, సమావేశాలకే సర్కారు పరిమితం అవుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

**అదనంగా 10లక్షల మంది..**

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా తొలుత 'మహాలక్ష్మి'పథకాన్ని ప్రారంభించింది. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా డిసెంబర్ 9న దీన్ని పట్టాలెక్కించారు. ఈ పథకం విజయవంతంగా నడుస్తోంది. బస్సుల్లో నిత్యం 10 లక్షల మందికిపైగా అదనంగా ప్రయాణిస్తున్నారు. గతంలో 66శాతంగా ఉన్న ఆక్యుపెన్సీ రేషియో 90శాతం దాటింది. ప్రత్యేక రోజుల్లో 101 శాతానికీ చేరుతోంది. ఉచిత ప్రయాణానికి సంబంధించిన సొమ్మును ప్రభుత్వం రీయింబర్స్ చేసే నేపథ్యంలో ఆర్టీసీ రోజువారీ ఆదాయం రూ.10 కోట్ల మేర పెరిగింది. ఈ నెల 17, 18 తేదీల్లో ఏకంగా రూ.22.50 కోట్ల చొప్పున ఆదాయం నమోదైంది. అయితే పెరిగిన రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ఇబ్బందులు వస్తున్నాయి. కర్ణాటకలో ఇదే తరహాలో పథకాన్ని ప్రారంభించినప్పుడు బస్సులు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మన ఆర్టీసీ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించినప్పుడు ఈ అంశం కూడా వారి దృష్టికి వచ్చింది. ఈ క్రమంలో యుద్ధప్రాతిపదికన కొత్త బస్సులు సిద్ధం చేసుకుని పథకాన్ని ప్రారంభించి ఉండాల్సిందని.. అలా చేయకపోవడంతో సమస్యలు వస్తున్నాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**నాలుగు వేల బస్సులు అవసరం**

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమలవుతోంది. ఈ కేటగిరీలకు సంబంధించి 7,292 బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. స్పేర్‌లో ఉంచే బస్సులను కూడా వాడేస్తున్నారు. ఇప్పుడున్న రద్దీని నియంత్రించాలంటే కనీసం నాలుగు వేల అదనపు బస్సులు అవసరమని అంచనా. ఇటీవల వచ్చిన కొత్త బస్సులు 50 మాత్రమే. గత ప్రభుత్వ హయాంలో వెయ్యి బస్సులకు ఆర్టీసీ ఆర్డర్ ఇచ్చింది. మరో వెయ్యి ఎలక్ట్రిక్ బస్సులు కొనేందుకు ఏర్పాట్లు చేసింది. అవి అందేందుకు కొన్ని నెలలు పట్టవచ్చని అధికారులు అంటున్నారు. ముఖ్యంగా ఇప్పుడు ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సులు అవసరం. ఇప్పటికిప్పుడు కొత్త బస్సులు కొనేందుకు ఆర్టీసీ వద్ద నిధులు లేవు. ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తే, లేదా ప్రభుత్వ పూచీకత్తుతో రుణాలు తీసుకుంటేనే కొనుగోళ్లు సాధ్యం. దీనిపై ఇంకా ఎలాంటి స్పష్టత లేకుండా పోయింది.

## జగదీష్ రెడ్డి జైలుకు వెళ్లడం ఖాయం: మంత్రి కోమటిరెడ్డి




**హైదరాబాద్:** కాంగ్రెస్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలుచేశారు. భూదోపిడీదారుడు జగదీష్ రెడ్డికి తనను విమర్శించే స్థాయి లేదని అన్నారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో అక్రమాలతో పాటు ఛత్తీస్‌గఢ్‌లో కరెంటు కొనుగోళ్లలో అవినీతి బయటపడుతుందన్న అక్కసుతోనే తనపై మాజీ మంత్రి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.. జగదీష్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపిస్తామని తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ ఖాళీ అవడం ఖాయమని మంత్రి కోమటిరెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ మూడు ముక్కలవుతుందని జోస్యం చెప్పారు. కేసీఆర్ కుటుంబం తర్వాత జైలుకు పోయేవ్యక్తి జగదీష్‌రెడ్డేనని అన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ తర్వాత జగదీష్ రెడ్డి జైలుకు పోవడం ఖామమని తెలిపారు.

## తెలంగాణలో గొర్రెల పంపిణీలో అక్రమాలపై ఏసీబీ కేసు

-మొదటి పేజి తరువాయి

ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను విచారిస్తామని వివరించారు.
గొర్రెల పంపిణీలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులలో ముందుగా ఎఫ్ఐఆర్ లో పేర్కొన్న వారిని విచారిస్తారని అధికార వర్గాల సమాచారం. రెండు మూడు రోజుల్లో విచారణ మొదలవుతుందని తెలుస్తోంది. ఎఫ్ఐఆర్ లో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవికుమార్, కేశవసాయిల పేర్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరిద్దరితో పాటు కొండాపూర్ కు చెందిన 'లోలోనా ది లైవ్' కంపెనీ కాంట్రాక్టర్ సయ్యద్ మొయిద్ కు ఈ స్కాంలో పాత్ర ఉందని తెలుస్తోంది.



సంపాదకీయం

# పౌర ప్రజాతంత్ర హక్కులపై దాడి

నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుంది. ఏ ప్రభుత్వంలోనైనా ప్రభుత్వం అనుసరించే రాజకీయార్థిక విధానాలపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయి. మోడీ ప్రభుత్వం బడాభూస్వామ్య, బూర్జువా, సామ్రాజ్యవాద ద్రవ్యపెట్టుబడికి విధేయతతో ఊడిగం చేసింది. అదే సమయంలో మనువాద, ఫాసిస్టు తరహా పద్ధతులను దూకుడుగా అమలు చేసింది. మరోవైపు రాజ్యాంగం ద్వారా ఏర్పడ్డ ఎన్నికల కమిషన్, న్యాయవ్యవస్థ, ఆర్‌బిఐ, ఇడి, సిబిఐ వంటి సంస్థలు స్వతంత్రతను, విశ్వసనీయతను కోల్పోయి ప్రభుత్వ జేబు సంస్థలుగా మారి తమ విధులను నిర్వర్తిస్తున్నాయి. దేశ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన మోడీ అసమర్థ, అసంబద్ధ పాలనా విధానాల ద్వారా దేశ ఆర్థిక, సామాజిక జనజీవనాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారు. 2014 ఎన్నికల్లో అభివృద్ధి ఎజెండాతో మోడీ తెరపైకి వచ్చారు. ఆర్భాట ప్రసంగాలు, అమోఘమైన వాగ్దానాలు, హావభావ విన్యాసాలు, ఆచరణకు నోచుకోని హామీలతో దేశ ప్రజలను బురిడీ కొట్టించి అధికారంలోకి వచ్చిన మోడీ దేశాన్ని అన్ని విధాలా అధోగతి పాలు చేశారు. ప్రజాస్వామ్యం ఖూనీ అయింది. ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో ఉంది. పారిశ్రామిక ఉత్పత్తుల సూచీ పడిపోయింది. వ్యవసాయం సంక్షోభంలో ఉంది. పౌర ప్రజాతంత్ర హక్కులపై దాడి పెరిగింది.ఆర్థిక అంతరాలు అనూహ్యంగా పెరిగాయి.నిరుద్యోగం 45 సంవత్సరాలలో అతి ఎక్కువ స్థాయికి చేరింది.ఇవాళ దేశంలో ఏనాడూ చూడని చీకటి రోజులను దేశ ప్రజలు చూస్తున్నారు. ఎన్నేళ్లు పాలించినా ఏమున్నది గర్వకారణం అన్నట్టుగా నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తీరుంది. అభివృద్ధి నినాదాలు, ప్రజాకర్షక వాగ్దానాల ప్రచార తప్ప ప్రజాహిత కార్యక్రమాలు ఒక్కటీ చేపట్టలేదు. స్వావలంబనకు కీలకంగా ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమలను పెద్ద ఎత్తున ప్రైవేటీకరించారు. ప్రభుత్వ సంస్థలు, గనులు, విద్యుత్, చమురు, గ్యాస్, ఓడరేవులు, విమానాశ్రయాలు వగైరా ప్రైవేటీకరించారు. పర్యవసానంగా అనూహ్యమైన స్థాయిలో ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, రాజకీయ అవినీతి పెరిగిపోయింది. 'ది ఎకానమిస్ట్' అంచనా ప్రకారం ముఖేశ్ అంబానీ నికర సంపద 2016 -20 మధ్యకాలంలో 350% పెరిగింది.ఇదే సమయంలో గౌతం అదానీ నికర సంపద 750% పెరిగింది. 2014లో అదానీకి 60 వేల కోట్ల రూపాయల సంపద ఉండగా, 2022 చివరి నాటికి రూ. 20 లక్షల కోట్లకు పెరిగింది. అదానీ ప్రపంచ కుబేరుల్లో రెండవ స్థానానికి చేరగా, సామాన్య ప్రజలు అధిక భారాలతో చితికిపోయారు. అయితే ఇదంతా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యంలోని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధాన నిర్మాణంలో అంతర్భాగమే. మోడీ పాలనలో నిజం మాట్లాడటం నేరం, ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలను విమర్శిస్తే నేరం. మోడీకి వ్యతిరేకంగా గళం విప్పితే నేరం. ప్రశ్నించే గళాలకు సంకెళ్లు నిత్యకృత్యమయ్యాయి. ఇవాళ దేశంలో హక్కులను, ప్రజాశ్రేయస్సును కాంక్షించేవారికి రక్షణ లేదు. ఇంతటి ఫాసిస్టు నిర్బంధాన్ని దేశం గతంలో ఏనాడు ఎదుర్కోలేదు. ఇవన్నీ ఇలా ఉండగా మోడీ పాలన దేశ మౌలిక స్వరూపాన్నే మార్చివేసే పథకాన్ని అమలు పరుస్తున్నది. భిన్నమతాల, భాషల, ప్రాంతాల, సంస్కృతుల దేశంగా శతాబ్దాల తరబడి కొనసాగుతున్న భారత సంస్కృతిని, ఒకే మత సంస్కృతిగా మార్చివేసి మైనారిటీలను రాచిరంపాన పెట్టే వ్యవస్థను నెలకొల్పడానికి సాగుతున్న దగా గురించి వివరించి చెప్పనక్కర లేదు. మహిళా లోకాన్ని అడుగు బయటపెట్టకుండా నాలుగు గోడలకే పరిమితం చేసే దుష్టఆలోచన తెర వెనుక సాగుతున్నది. ప్రజలకు తాత్కాలికంగా ఎదురవుతున్న ఆకలి, నిరుద్యోగం వంటి సమస్యలను ఎప్పుడైనా పరిష్కరించుకోవచ్చు. కాని సెక్యులర్ రాజ్యాంగాన్ని కొనసాగనిస్తూనే అది బోధిస్తున్న వైవిధ్యాన్ని బలి తీసుకోవడం వల్ల దేశానికి అపరిమితమైన హాని కలుగుతుంది. మోడీ బలం ఆయన ఆర్థిక విధానాలలో లేదు. భారత జాతీయవాదం దేశ పౌరులందరినీ సమానంగా చూస్తుంది. కాని హిందూ జాతీయవాదం ఈ దేశం హిందువులది మాత్రమేనని ఇతరులంతా పరాయివారుగా విభజిస్తుంది. విద్వేష రాజకీయాన్ని సాగిస్తున్నది. ఈ భావజాలమే దేశానికి ఒక హీరోని ముందుకు తెస్తుంది. భక్తులని, ఉన్మాదులను తయారు చేస్తుంది. ఈ అగ్గి చల్లారకుండా రోజుకొక మతవివాదాన్ని ముందుకు తెస్తారు. ఒక మందిరం తర్వాత మరొక మందిరం, ఒక కట్టడం తర్వాత మరో కట్టడం, ఒక పేరు మార్పిడి తర్వాత మరొకటి, చరిత్రను తిరగరాయడం, పురాణాలే చరిత్రలుగా ప్రకటించడం, మనువాదమే మన రాజ్యాంగం అనే వివాదాలే నిత్య ఎజెండా అవుతుంది. నిత్య చర్చల పేరుతో మీడియా ఈ విద్వేషాన్ని రోజువారీ టానిక్కుగా ప్రజలకు అందిస్తాయి. ఇలాంటి ఉన్మాదం, విద్వేషం ప్రజల తలకెక్కితే నిత్య జీవిత సమస్యలు తెరమరుగవుతాయి. మోడీ సర్కార్ అనుసరిస్తున్న విద్వేష రాజకీయం, ఉన్మాద రాజకీయం, ఫాసిస్టు భావజాలం పౌరసమాజపు లోకజ్ఞానంలో భాగం అవుతున్నది. ఇదే మోడీకి బలంగా మారుతున్నది. ప్రశ్నించేవాడు దేశద్రోహి అవుతాడు. కాదన్నవాడు జైలు పాలవుతాడు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాక దేశంలో ఆర్థిక వృద్ధి పెరిగినా ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. అంటే పెరుగుతున్న వృద్ధి ఉపాధి రహిత వృద్ధి అని అర్థమవుతున్నది. వేగంగా పెరుగుతున్న యాంత్రీకరణ, దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతికత వల్ల కార్పొరేట్ల లాభాలు పెరుగుతున్నాయి కానీ, ఉపాధి పెరగడం లేదు. మన దేశంలో పెరుగుతున్న జిడిపి వృద్ధి రేటు, నిరుద్యోగితా రేటును పోల్చిచూస్తే మన ఆర్థిక వ్యవస్థ పనితీరు అర్థం కాగలదు. 1999లో జిడిపి వృద్ధిరేటు 8.85 ఉంటే నిరుద్యోగితా రేటు 5.74 ఉండింది. 2003లో జిడిపి వృద్ధి రేటు 7.5 ఉంటే నిరుద్యోగితా రేటు 5.64 ఉండింది. 2021లో జిడిపి వృద్ధి రేటును 8.95గా గుర్తించారు. అయితే నిరుద్యోగితా రేటు కూడా అదే స్థాయిలో పెరిగింది. 2022లో ఇది 8.7%గా నమోదైంది.కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో ఉన్న శాఖల్లో తొమ్మిదేళ్లలో 8 లక్షల పోస్టులు మాత్రమే భర్తీ చేసింది. ఆర్థిక శాఖ, నీతి ఆయోగ్ నివేదికల ప్రకారం ఇంకా 18 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో విద్యార్హతలకు తగిన కొలువు దొరక్క 22 కోట్ల మంది యువతీ, యువకులు వీధుల్లో చెప్పులరిగేలా తిరుగుతున్నారు. వీరికి ప్రతి ఏటా ఒక కోటి ఇరవై లక్షల మంది కొత్తగా తోడవుతున్నారు. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) తాజా నివేదిక ప్రకారం మార్చిలో 7.8 శాతంగా ఉన్న నిరుద్యోగిత రేటు ఏప్రిల్ నాటికి 8.11 శాతానికి ఎగబాకింది. వయస్సు మీరిపోతున్నా తాము చదువుకొన్న చదువులకు తగిన ఉద్యోగావకాశాలు లేక నిరాశకు గురవుతున్నారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో 20 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, మీరు ఇచ్చిన 80 వేల నియామక పత్రాలు అందులో ఎంత, ఏమేరకు అని యువత ఎద్దేవా చేస్తోంది. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా కాలక్షేపం చేస్తూ ఇంకొక వైపు వివిధ ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుకు అప్పగిస్తూ భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలంటూ లేని పరిస్థితిని సృష్టిస్తున్నారు.ఇటీవలి కాలంలో ఒక వైపరీత్యం కనిపిస్తోంది. సహజంగా జాతీయ ఆదాయం పెరిగితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భావిస్తాం. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాక దేశంలో ఆర్థిక వృద్ధి పెరిగినా ఉపాధి అవకాశాలు పెరగడం లేదు. అంటే పెరుగుతున్న వృద్ధి ఉపాధి రహిత వృద్ధి అని అర్థమవుతున్నది. వేగంగా పెరుగుతున్న యాంత్రీకరణ, దినదినాభివృద్ధి చెందుతున్న సాంకేతికత వల్ల కార్పొరేట్ల లాభాలు పెరుగుతున్నాయి. కానీ, ఉపాధి పెరగడం లేదు. దేశంలో పెరుగుతున్న జిడిపి వృద్ధి రేటు, నిరుద్యోగితా రేటును పోల్చిచూస్తే మన ఆర్థిక వ్యవస్థ పని తీరు అర్థం కాగలదు. 1999లో జిడిపి వృద్ధిరేటు 8.85 ఉంటే, నిరుద్యోగితా రేటు 5.74 ఉండింది. 2003లో జిడిపి వృద్ధి రేటు 7.5 ఉంటే, నిరుద్యోగితా రేటు 5.64 ఉండింది. 2021లో జిడిపి వృద్ధి రేటును 8.95గా గుర్తించారు. అయితే నిరుద్యోగితా రేటు కూడా అదే స్థాయిలో పెరిగింది. 2022లో ఇది 8.7 శాతంగా నమోదైంది. నిరుద్యోగం, దారిద్ర్యం, ఆర్థిక అసమానతలు ఆందోళనకరమైన రీతిలో పెరిగాయి. అయినప్పటికీ ఆర్థిక మందగమనం పట్ల ప్రభుత్వం స్పందిస్తున్నతీరు, ఆదాయం,-సంపదలలో అసమానతలు మరింత పెరగడానికే కారణమయింది.

# ఇజ్రాయెల్‌లో జర్నలిస్టులు జైలుకి!




మధ్య ఆసియాలో ప్రజాస్వామ్య దేశంగా, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు నెలవుగా పేరొందిన ఇజ్రాయెల్ ఓ దేశంగా ఆవిర్భవించిన తర్వాత మొదటిసారిగా హమాస్ తీవ్రవాదుల నుండి తీవ్రమైన ప్రతిఘటన ఎదుర్కొంటూ, దారుణమైన యుద్ధంలో చిక్కుకొంది. ఈ యుద్ధం మొత్తం మధ్య ఆసియాకు వ్యాపిస్తూ, తీవ్ర ఉద్రిక్తలకు దారితీస్తూ అంతర్జాతీయంగా కూడా ఘర్షణమయ వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇటువంటి ఉద్రిక్తతల నేపథ్యంలో జర్నలిస్టులు తమ వ్యాపకం స్వేచ్ఛగా కొనసాగించడం దుర్లభంగా మారింది. ఇజ్రాయెల్ మొదటిసారి జర్నలిస్టులను అధిక సంఖ్యలో జైలుకు పంపుతున్న దేశంగా ఖ్యాతి గడించింది. తాజాగా 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్' (సిపిజె) విడుదల చేసిన జైళ్లలో గడుపుతున్న జర్నలిస్టుల వార్షిక నివేదిక ప్రకారం గత నెల డిసెంబర్ 1 నాటికి ఈ దేశంలో 17 మంది జర్నలిస్టులు జైళ్లలో ఉన్నారు. 1992లో జర్నలిస్టుల అరెస్టులను సిపిజె నమోదు చేయడం ప్రారంభించిన తర్వాత నిర్బంధంలో ఉన్న పాలస్తీనా జర్నలిస్టుల సంఖ్య ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఎక్కువగా జర్నలిస్టులను జైళ్లలో పెట్టిన దేశాలలో ఆరవ దేశంగా ఇజ్రాయెల్ నిలిచింది. అక్టోబరు 7న ఇజ్రాయెల్-గాజా యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి 80 మందికి పైగా జర్నలిస్టులు మరణించడంతో జర్నలిస్టులకు మృత్యుకూపంగా మొదటిసారి ఇజ్రాయెల్ మారింది. సిపిజె నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 320 మంది జర్నలిస్టులు తమ వృత్తి వ్యాపకానికి సంబంధించి డిసెంబర్ 1, 2023 నాటికి ఖైదు చేయబడ్డారు. 1962 నుండి సిపిజె విడుదల చేస్తున్న వార్షిక నివేదికలలో అత్యధికంగా జర్నలిస్టులు జైలుకు వెళ్లిన రెండో సంవత్సరం ఇదే. ఇదివరలో అత్యధికంగా 2022లో 360 మంది జైలుకెళ్లారు. 2023లో అత్యధికంగా జర్నలిస్టులను జైలుకు పంపిన దేశాలు చైనా (44), మయన్మార్ (43), బెలారస్ (28). అంటే మొత్తం జైళ్లలో ఉన్న జర్నలిస్టులలో మూడవ వంతు (35.8%) మంది ఈ మూడు దేశాలలోనే ఉన్నారు.ఆ తర్వాత రష్యా (22), వియత్నాం (19)లలో ఎక్కువ మంది జర్నలిస్టులు జైళ్లలో ఉన్నారు.

'క్రిటికల్ రిపోర్టింగ్‌ను అరికట్టడానికి, ప్రజల జవాబుదారీతనాన్ని నిరోధించడానికి ప్రభుత్వాలు ధైర్యంగా ఉండడంతో, ప్రపంచ వ్యాప్తంగా అధికారవాదం ఎంతగా పాతుకుపోయిందో మా పరిశోధన చూపిస్తుంది. పాలస్తీనా జర్నలిస్టులను నిశ్శబ్దం చేయడానికి ఇజ్రాయెల్ క్రూరమైన పద్ధతులను ఉపయోగించడంతో ప్రాథమిక ప్రజాస్వామ్య ప్రమాణం పత్రికా స్వేచ్ఛను హరించి వేస్తున్నట్టు రుజువు చేస్తుంది' అని సిపిజె చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జోడీ గిన్స్‌బర్గ్ పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇజ్రాయెల్ ఈ జాబితాలో ముందంజలో ఉండేందుకు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో అనుసరిస్తున్న అడ్మినిస్ట్రేటివ్ నిర్బంధం కారణమవుతుంది. కేవలం ఒక సైనిక కమాండర్ ఎవరినైనా ఎటువంటి అభియోగాలు లేకుండా నిర్బంధించడానికి, వారి నిర్బంధాన్ని భవిష్యత్‌లో నేరం చేయవచ్చనే ఆరోపణతో అపరిమిత సంఖ్యలో పొడిగించడానికి అనుమతిస్తున్నారు.సాధారణంగా తమ విధానాలను తప్పుబడుతూ కథనాలు రాసే జర్నలిస్టులను రాజకీయ నాయకులు లక్ష్యంగా చేసుకోవడం జరుగుతూ ఉంటుంది. కానీ ఇటీవల కాలంలో మెజారిటీ జర్నలిస్టులు తమ విమర్శనాత్మక కథనాలకు ప్రతీకారంగా తప్పుడు వార్తలు రాశారనో, ఉగ్రవాదం వంటి ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు ఆరోపణలు ఎదుర్కొంటున్న జర్నలిస్టులలో 65 శాతానికి పైగా నకిలీ వార్తలు, ఉగ్రవాద ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 60 మందికి పైగా జర్నలిస్టులు ఎలాంటి అభియోగాలు వెల్లడించకుండా నిర్బంధానికి గురయ్యారు. రష్యా, ఇథోఫియా వంటి దేశాలు తమ సరిహద్దులను దాటి జర్నలిస్టులను వేధిస్తుంటే, ఎటువంటి నేరారోపణలు లేకుండా సుదీర్ఘకాలం జర్నలిస్టులను జైళ్లలో ఉంచడం, వారి పట్ల క్రూరమైన విధంగా వ్యవహరించడం చాలా దేశాల్లో సర్వసాధారణంగా మారుతున్నది.

వియత్నాం, ఈజిప్టు వంటి దేశాలలో వారు విడుదలైన తర్వాత కూడా జర్నలిస్టులపై ప్రయాణ నిషేధాలు, ఇతర ఉద్యమ ఆంక్షలు విధిస్తూ వారి స్వేచ్ఛను కట్టడి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా మనం ఒక క్లిష్టమైన పరిస్థితికి చేరుకున్నాము. రిపోర్టింగ్‌ను నిశ్శబ్దం చేసే చట్టాల ఆయుధీకరణకు ముగింపు పలకాలి. జర్నలిస్టులు రిపోర్ట్ చేయడానికి స్వేచ్ఛగా ఉండేలా చూడాలి' అని గిన్స్‌బర్గ్ చెప్పారు. 2024లో 75కు పైగా దేశాలలో ఎన్నికలు జరగనున్నాయి. అమెరికా, రష్యా, భారత్, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్‌లతో పాటు ఇండోనేషియా, పాకిస్తాన్, ఉక్రెయిన్, మెక్సికో, వెనిజులాలలో ఎన్నికలు జరగనున్నాయి. ఐరోపాలోని దాదాపు తొమ్మిది దేశాల ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇటీవలనే మొత్తం ప్రతిపక్షాలు పాల్గొనకుండా బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జరగడాన్ని చూసాము. తైవాన్ ఎన్నికలు జరిగాయి. ఇటువంటి సమయంలో జర్నలిస్టులు నిర్భయంగా తమ వృత్తి వ్యాపకాలను చేపట్టలేకపోతే మొత్తం ప్రజాస్వామ్యానికే ప్రమాద ఘడియలు కాగలవని గ్రహించాలి.

సిపిజె నివేదిక ప్రకారం 2023లో అత్యధిక సంఖ్యలో జర్నలిస్టులు జైల్లో ఉన్న ప్రాంతంగా ఆసియా ఉంది. ప్రపంచంలోనే అత్యధికంగా జర్నలిస్టులు జైళ్లలో ఉన్న మూడు దేశాలు- చైనా, మయన్మార్, వియత్నాం కూడా ఆసియాలోనే ఉండటం గమనార్హం. వీటితో పాటు భారత్, అఫ్ఘానిస్తాన్, ఫిలిప్పీన్స్‌లలో సహితం పలువురు జర్నలిస్టు కటకటాల వెనుక ఉన్నారు. ఉగ్రవాద వ్యతిరేక ఆరోపణలు, ప్రమాదకరమైన చట్టాల క్రింద ఆరోపణలు, న్యూస్ రూమ్‌లపై దర్యాప్తు సంస్థల దాడులు సర్వసాధారణంగా మారిన దేశాలలో ఈ ఏడాది ఎన్నికలు జరగనుండడం పత్రికా స్వేచ్ఛకు ఒక విషమ పరీక్షగా భావించవచ్చు. జర్నలిస్టుల విషయంలో ప్రపంచంలోనే ఎక్కువగా జర్నలిస్టులను జైళ్లకు పంపే దేశాలలో అగ్రగామిగా సంవత్సరాల తరబడి ఉంటూ వస్తున్న చైనాలో సెన్సార్‌షిప్ అమలులో ఉంటున్నది. అసలు ఆ దేశంలో ఎంత మంది జర్నలిస్టులు జైళ్లలో ఉన్నారో ఖచ్చితంగా తెలియని పరిస్థితి నెలకొంది.

సామూహిక ప్రజాస్వామ్య అనుకూల నిరసనల మధ్య బీజింగ్ కఠినమైన జాతీయ భద్రతా చట్టాన్ని అనుసరించి హాంకాంగ్‌లో తన సెన్సార్‌షిప్ పాలనను కొనసాగిస్తోంది. ఇప్పుడు మూతబడిన ప్రజాస్వామ్య అనుకూల వార్తాపత్రిక 'ఆపిల్ డైలీ' వ్యవస్థాపకుడు జిమ్మీ లై విదేశీ కుట్ర ఆరోపణలపై తనపై చివరకు విచారణ ప్రారంభించడానికి ముందు దాదాపు 1,100 రోజులు కటకటాల వెనుక ఉండాల్సి వచ్చింది. ఐరోపా, మధ్య ఆసియాలో, బెలారస్, రష్యా- ఉక్రెయిన్‌పై మాస్కో పూర్తి స్థాయి యుద్ధంలో మిత్రపక్షాలు- అసమాన సంఖ్యలో జర్నలిస్టులను కటకటాల వెనుక ఉంచాయి. బెలారసియన్ ప్రెసిడెంట్ అలెగ్జాండర్ లుకాషెంకో వివాదాస్పద రీఎంపికపై సామూహిక నిరసనల తర్వాత, బెలారసియన్ అధికారులు 2020 నుండి జర్నలిస్టులను ఎక్కువగా జైళ్లలో పెడుతున్నారు. బెలారస్‌లోని 70% పైగా జర్నలిస్టులు ప్రభుత్వ వ్యతిరేక ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. దాదాపు సగం మంది ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం శిక్షలు అనుభవిస్తున్నారు. విదేశీ రిపోర్టర్లను జైలు లో పెట్టడంలో రష్యా నిష్ణాతులుగా మారింది. ఖైదు చేసిన 17 మంది విదేశీ -జాతీయ జర్నలిస్టులలో 12 మంది వివిధ దేశాలకు చెందినవారు. వీరిలో అమెరికాకు చెందిన ఇవాన్ గెర్ష్‌కోవిచ్, అల్సు కుర్మాషెవా ఇద్దరూ విచారణ ప్రారంభం కాకుండానే నిర్బంధంలో ఉన్నారు. అంతర్జాతీయ అణచివేతలో భాగంగా ఇతర దేశాలలో నివసిస్తున్న రష్యన్ జర్నలిస్టులపై కూడా రష్యా అరెస్టు వారెంట్లు జారీ చేస్తున్నది. జైలు శిక్షకు గురవుతున్న వారు తరచుగా నిస్సందేహంగా క్రూరమైన పరిస్థితులను ఎదుర్కొంటుంటారు. అధికారులు జర్నలిస్టులపై నిర్దుష్ట ఆరోపణలు, విచారణ లేకుండానే నిర్బంధాన్ని పొడిగిస్తుంటారు. జర్నలిస్టులకు న్యాయ సహాయం అందించేందుకు ముందుకు వచ్చే న్యాయవాదులు సహితం ప్రపంచ వ్యాప్తంగా ప్రతీకార చర్యలను ఎదుర్కొంటున్న పరిస్థితులు నెలకొంటున్నాయి

# ఆదాయ అసమానతల్లో భారత రాష్ట్రాలు




గత మూడు దశాబ్దాలుగా భారత రాష్ట్రాల్లో ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయని, దేశ సగటుతో పోల్చితే రాష్ట్రాల తలసరి స్టేట్ డొమెస్టిక్ ప్రాడక్ట్ (ఎస్‌డిపి)లో దక్షిణ/పశ్చిమ/ఈశాన్య భారత రాష్ట్రాలు అధిక ఆదాయాలతో విరాజిల్లుతుండగా, ఉత్తర/మధ్య/తూర్పు రాష్ట్రాల ఆదాయాలు తక్కువ ఆదాయాలతో గుర్తించబడ్డాయి. ఈ విధంగా దక్షిణ, ఉత్తర రాష్ట్రాల మధ్య ఆదాయ వ్యత్యాసాలు క్రమంగా పెరగడం కూడా భారత ప్రభుత్వానికి సవాలుగా నిలుస్తున్నది. 1990 - 91 వివరాల ప్రకారం అల్ప ఆదాయ రాష్ట్రాలతో పోల్చితే అధిక ఆదాయ రాష్ట్రాల ఆదాయం 1.7 రెట్లు అధికంగా ఉండడం, 2019 - 20లో ఈ నిష్పత్తి 2.5 రెట్లకు పెరగడం సోచనీయం. అల్ప ఆదాయ రాష్ట్రాల ఆదాయాలు క్రమంగా తగ్గుతూ అధిక ఆదాయ రాష్ట్రాల ఆదాయాలు క్రమంగా పెరుగుతున్నట్లు తేలింది. మాన్యుఫాక్చరింగ్ రంగంలో తలసరి కాపిటల్ ఎస్‌డిపి అధిక ఆదాయ, అల్పఆదాయ రాష్ట్రాల నిష్పత్తి 1990 - 91లో 2.4 రెట్ల నుంచి 2020 - 21లో 3.6 రెట్ల వరకు పెరగడం గమనించారు. అదే విధంగా సర్వీస్ సెక్టార్లో 2.0 నుంచి 2.9 వరకు పెరిగినట్లు వివరాలు స్పష్టం చేస్తున్నాయి. దేశ సగటు కన్న అధిక ఆదాయాలను నమోదు చేసిన రాష్ట్రాల జాబితాలో దక్షిణ/పశ్చిమ భారత తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి, లక్షద్వీప్, ఆంధ్ర, తెలంగాణ, గోవా, మహారాష్ట్ర, గుజరాత్‌లతో పాటు తూర్పున అరుణాచల్, మిజోరామ్, సిక్కిమ్‌లు ఉత్తర భారత ఢిల్లీ, పంజాబ్, హర్యానా, చండీఘర్, హిమాచల్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు చోటు దక్కించుకున్నాయి. దేశ సగటు కన్న తక్కువ ఆదాయం నమోదు చేసిన ఉత్తర/మధ్య/ఈశాన్య రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్, యూపీ, ఎంపీ, బీహార్, చత్తీస్‌ఘడ్, ఝార?ండ్, ఒడిసా, పశ్చిమ బెంగాల్, జె అండ్ కె, లడక్, అస్సామ్, నాగాలాండ్, మణిపూర్, త్రిపుర, మేఘాలయ రాష్ట్రాలు ఉన్నాయి. అల్ప ఆదాయ రాష్ట్రాల మాన్యుఫాక్చరింగ్, సర్వీస్ రంగాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవలసిన సత్వర అదనపు చర్యల అవసరాలను వివరిస్తున్నది. రోడ్డు/రైలు మార్గ మౌలిక వనరుల పెట్టుబడుల్లో ఉత్తర భారత రాష్ట్రాలు దేశ సగటు కన్న అధిక నిధులను పొందుతున్నట్లు తెలుస్తున్నది. తెలంగాణ/ఆంధ్రల్లో రోడ్డు నిర్మాణాలు, మహారాష్ట్ర/తెలంగాణ/కర్నాటకల్లో రైలు మార్గాలు దేశ సగటు కన్న తక్కువగా ఉండడం ఆశ్చర్యకరంగా తోస్తున్నది. గంగా పరివాహక/తూర్పు రాష్ట్రాల్లో తలసరి విద్యుత్ వినియోగంలో దేశ సగటు (2022 వివరాల ప్రకారం 1,221 కెడబ్ల్యూహెచ్) కన్న తక్కువగా ఉండడం గమనించారు. ఎంటర్‌ప్రూ్యనర్‌షిప్ రంగంలో అధిక ఆదాయ, అల్ప ఆదాయ రాష్ట్రాల మధ్య అంతరాలు అధికంగా గమనించారు. 2019 - 20 వివరాల ప్రకారం ఫ్యాక్టరీలు/ఫిక్స్‌డ్ క్యాపిటల్/ఎంప్లాయ్‌మెంట్ రంగాల్లో అధిక ఆదాయ రాష్ట్రాల వాటా 75 శాతం వరకు ఉండడం జరిగింది. భారత్‌లోని 91 మంది సంపన్న ఎంటర్‌ప్రూ్యనర్స్‌లో 87 మంది అధిక ఆదాయ రాష్ట్రాలకు చెందినారే ఉండడం గమనార్హం. సరళీకరణ విధానాలు చేపట్టిన తర్వాత ఐటి రంగానికి అపారమైన ఆదరణ పెరగడం చూస్తున్నాం. అంతర్జాలం మానవాళిని ఏకం చేస్తూ, జీవన విధానాలను సమూలంగా మార్చుతోంది. మన జిడిపీలో 7.4 శాతం ఐటీ అందిస్తూనే 5.4 మిలియన్ల ఉద్యోగాలకు తలుపులు తీసింది. దేశ ఐటీ విస్తరణ (అల్పాదాయ రాష్ట్రాలకు చెందిన కలకత్తా, జైపూర్, భోపాల్, ఇండోర్, భువనేశ్వర్ నగరాలు మినహా) అధిక ఆదాయ రాష్ట్రాల్లోనే గణనీయంగా జరుగుతున్నది. సరళీకరణ విధానం ప్రవేశపెట్టిన అనంతరం ప్రభుత్వ పెట్టుబడులతో పోల్చితే ప్రైవేట్ రంగ పెట్టుబడులు పెరగడం గమనించారు. గత రెండు దశాబ్దాల్లో ప్రభుత్వ పెట్టుబడులు 40 నుంచి 23 శాతానికి పడిపోవడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులు 18 నుంచి 38 శాతానికి పెరగడం శుభపరిణామంగా పేర్కొనబడింది.

వివిధ రాష్ట్రాల్లో శ్రామిక వర్గ అందుబాటు అంశం కూడా రాష్ట్ర ఆదాయ అంతరాలకు ఉపకరిస్తున్నది. ఉత్తర, కేంద్రప్రాంత రాష్ట్రాల్లో పట్టణ శ్రామిక శక్తి, ఉపాధి వర్కర్లు, పట్టణ మహిళా శ్రామిక శక్తి ఆదాయాలు చాలా తక్కువగా ఉన్నాయని స్పష్టం అవుతున్నది. దేశ ఇంజనీరింగ్ విద్య 70 శాతం వరకు అధిక ఆదాయ రాష్ట్రాల యువతకు అందుతున్నదని, దీని వల్ల ఈ ప్రాంతాల్లో ఐటీతో పాటు ఇతర సంబంధిత పరిశ్రమలు ఆయా రాష్ట్రాల్లోనే నెలకొల్పబడుతున్నట్లు విశ్లేషించారు. అల్పాదాయ రాష్ట్రాల్లో కార్మికుల, ఎంటర్‌ప్రూ్యనర్స్ నైపుణ్యాలు కూడా తక్కువగా ఉన్నట్లు తేలింది. నేడు అల్పాదాయ ఉత్తర, మధ్య భారత రాష్ట్రాల్లో ఆదాయ మార్గాలు పెంచితేనే దేశవ్యాప్తంగా రాష్టాల మధ్య ఆదాయ వ్యత్యాసాలు తగ్గి దేశ జనాభా ఒక వరంగా మారుతుందని, లేని యెడల మన జనాభా మనకే శాపంగా అశాంతికి నెలవుగా మారుతుందని తెలుసుకొని ప్రభుత్వాలు తగు పటిష్ట చర్యలను అమలు చేయడం ప్రారంభించాయి.

# మేడిగడ్డ బ్యారేజ్ మొత్తం ప్రమాదంలోనే

**హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో...సంచలన విషయాలు వెలుగు లోకి వచ్చాయి. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణం... దేశంలోనే భారీ స్కాం జరిగినట్లు గుర్తించింది. 3వేల కోట్లకుపైగా ప్రజాధానం వృథా అయినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికలో వెల్లడించింది. 3వేల 200కోట్ల ప్రజాధనాన్ని బ్యారేజ్ నిర్మాణం పేరుతో వృథా చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణలో తేలింది. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో అక్రమాలపై మధ్యంతర నివేదికను సిద్ధం చేసింది విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్. వారం రోజుల్లో ప్రభుత్వానికి మధ్యంతర నివేదికను సమర్పించేందుకు రెడీ అవుతోంది. ప్రజాధనం పేరుతో మేడిగడ్డ బ్యారేజ్ నిర్మించి...ఆటలు ఆడుకున్నారని విజిలెన్స్ నివేదికలో పొందుపర్చింది. నిర్మాణంలో భాగస్వా ములైన ప్రతి ఒక్కరు దోషులేనని...ఎన్ని పిల్లర్లు ఎంత బలంగా ఉన్నాయన్నది తేల్చాల్సి ఉందని అభిప్రాయపడింది. మేడిగడ్డ బ్యారేజ్ నిర్మాణంలో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. బ్యారేజ్‌లో ప్రస్తుతం ఉన్నపియ ర్స్‌లో... 11 పియర్స్ బాగా దెబ్బతిన్నట్లు విజిలెన్స్ తేల్చింది. దెబ్బతిన్న పియర్స్ మరమ్మతులు చేసినంత మాత్రాన... బ్యారేజీకి ఎలాంటి గ్యారెంటీ లేదని స్పష్టం చేసింది. లొకేషన్ నుంచి మొదలుకుని డిజైన్, నిర్మాణం, నాణ్యత నిర్వహణ వరకు అంతా గందరగోళంగా ఉందని విజిలెన్స్ తేల్చింది. పియర్స్‌కు ఉన్న సిమెంట్...తక్కువ కాలంలోనే సిమెంట్ పోయిందని విజిలెన్స్ తేల్చింది. గడ్డర్ల వద్ద పగుళ్లు, ఉపయోగించిన స్టీల్స్ చూస్తే నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తోందని తెలిపింది. ప్రాథమిక అంచనా ప్రకారం మొత్తం బ్యారేజ్ ప్రమాదంలో ఉందని అనుమానం వ్యక్తం చేసింది. బ్యారేజీ కింది భాగంలో 10 టన్నుల బరువుతో ఉన్న సిమెంటు బ్లాక్స్ వంద మీటర్లు దూరం కొట్టుకుపోయాయన్న విజిలెన్స్...బ్యారేజ్ కుంగడం అకస్మాత్తుగా జరిగింది కాదని, రెండు మూడేళ్ల క్రితం నుంచే




సమస్య ఉన్నట్లు వెల్లడించింది. వరద ప్రవాహానికి తగ్గట్లు డిజైన్ లేదని, సెంట్రల్ వాటర్ కమిషన్ నుంచి నివేదిక తెప్పించుకోలేదని విజిలెన్స్ తెలిపింది. వరద ఉధృతి అంచనా వేయకుండానే డిజైన్ చేశారని నివేదికలో పొందు పరిచింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజీ వ్యవహారం ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ ఎత్తున అవినీతి జరిగిందని.. దానికి నిదర్శనమే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపణలు చేస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ డ్యామేజీపై విజిలెన్స్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది రేవంత్ సర్కార్. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. రంగంలోకి దిగిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్ మెంట్ క్షేత్రస్థాయిలోకి వెళ్లి బ్యారేజ్ ను పరిశీలించింది. ఏడో బ్లాక్‌లోనే కాకుండా అటూ ఇటూ ఉండే 6,8 బ్లాక్‌లలో కూడా మరిన్ని పియర్స్‌కు నష్టం వాటిల్లినచ్లు అంచనాలు వేస్తున్నా యి. బ్యారేజీ దిగువన ఒక్కొక్కటి 20టన్నుల బరువుతో ఉన్న సిమెంటు బ్లాక్స్ వంద మీటర్లు దాటి కొట్టుకుపోవడం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. డిజైన్‌లో కూడా లోపాలు ఉన్నట్లు భావిస్తున్న అధికారులు, లాగ్‌బుక్, కాంక్రీటు మిక్సింగ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు కూడా అన్నీ లేవని సంబంధిత ఇంజినీర్లు చెప్పినట్లు తెలిసింది. డ్యామేజ్ అయిన మేడిగడ్డ బ్యారేజ్ పై సంచలన రిపోర్ట్ సిద్ధం చేసింది.

# బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులుగా కొత్త వారికి ప్రాధాన్యం

**హైదరాబాద్ :** అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం తర్వాత బీఆర్ఎస్ పార్టీ లోక్ సభ ఎన్నికలను చాలెంజింగ్ గా తీసుకుంది. ఆషామాషీగా కాకుండా పూర్తి స్థాయిలో విజయం కోసం ప్రయత్నించాలని నిర్ణయించుకుంది. అందుకే అభ్యర్థుల విషయంలో కేసీఆర్ ప్రత్యేకంగా కసరత్తు చేస్తున్నారు ప్రస్తుతం ఉన్న సిట్టింగ్ అభ్యర్థుల్లో బలంగా ఉన్న ఒకరిద్దర్ని తప్ప అందర్నీ మార్చేయాలనుకుంటున్నారు. దాదాపుగా అందర్నీ కొత్త వారిని దించి ప్రయోగం చేయాలనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ఇందు కోసం తటస్థులైన ప్రముఖుల్ని సంప్రదిస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ సారి కొన్ని చోట్ల ఊహించని అభ్యర్థులు ఉండే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. బీఆర్ఎస్ టిక్కెట్ కోసం ఒక్కో నియోజకవర్గానికి ఐదు నుంచి పది మంది పోటీ పడతారు. కానీ ఇప్పుడు లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీనియర్లు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఆసక్తి చూపని వాళ్లను అసలు లెక్కలోకి తీసుకోవడంలేదు. అభ్యర్థులపై ఎలాంటి సూచనలు కూడా ఇవ్వడంలేదు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికపై కేసీఆర్ కసరత్తు చాలాకాలంగా చేస్తున్నారు. అయితే నియోజవకర్గాల సమీక్షల్లో కూడా అభ్యర్థులపై కనీసం హింట్ ఇవ్వడం లేదు. చేవెళ్ల నుంచి రంజిత్ రెడ్డి పోటీ చేస్తారని ప్రకటించారు కానీ.. ఇంకొకరికి సీటు ఖాయం చేయలేదు. చివరికి కేసీఆర్ కుటుంబ సభ్యులకూ టిక్కెట్లు ఖరారు చేయలేదు. చివరికి మెదక్ నుంచి కేసీఆర్ , నిజామాబాద్ నుంచి కవిత పేర్లను కూడా ప్రకటించలేదు. వారిద్దరూ పోటీ చేయడం లేదని తేలిపోయింది. ఇక సిట్టింగ్ స్థానాల్లో అభ్యర్థుల్లో కనీసం ఆరుగురికి ఈ సారి టిక్కెట్ ఇచ్చే చాన్స్ లేదని భావిస్తున్నారు. ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు పేరును కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ప్రకటించారు. ఖమ్మంలో పోటీ చేయడానికి ఆయన కంటే బలమైన అభ్యర్థి ఇంక ఎవరూ లేరు. ఆయన పోటీ చేయడం ఖాయమే. నల్లగొండ, భువనగిరి నియోజకర్గాల్లో పోటీకి పార్టీ నేతలు ఆసక్తి చూపిస్తున్నారు. గుత్తా సుఖేందర్ తన కుమారుడు పోటీ చేస్తారని చెబుతున్నారు. కానీ ఆయనకు కేసీఆర్ ఎలాంటి హామీ ఇవ్వలేదు. ఉత్తర తెలంగాణలో కరీంనగర్ బోయినపల్లి వినోద్ కుమార్ పోటీ చేస్తారా లేదా అన్నది కూడా ప్రకటించలేదు. మహబూబ్ నగర్ నుంచి పోటీ చేయడానికి ఇటీవల టీడీపీ నుంచి పార్టీలో చేరిన రావుల చంద్రశేఖర్ రెడ్డి పేరును గతంలో అనుకున్నారు కానీ.. ఎన్నికల ఫలితాల తర్వాత ఇంకా బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలన్న



ఆలోచన కేసీఆర్ చేస్తున్నారని అంటున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి 9 మంది లోకసభ సభ్యులు ఉన్నారు. వీరిలో ఇద్దరు, ముగ్గురు మాత్రమే పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన వారిలో నాగర్ కర్నూలు ఎంపీ పార్టీకి దూరంగా ఉంటున్నారు. గతంలో ఆయన రేవంత్ రెడ్డిని కూడా కలిశారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌కు ఈ సారి చాన్స్ ఉండదని భావిస్తున్నారు. అందుకే ఆయనకు చాన్స్ లేనట్లే. అదే సమయంలో కొంత మంది కీలక నేతలు, బడా వ్యాపారవేత్తలైన వారు కాంగ్రెస్ తరపున పోటీకి ఆసక్తి చూపుతున్నట్లుగా బీఆర్ఎస్ చీఫ్ అనుమానిస్తున్నారు. ఎవరు ఉన్నా లేకపోయినా అయితే బీఆర్ఎస్ చీఫ్ మాత్రం ఈ సారి బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలని గట్టి పట్టుదలగా ఉన్నారు. భారత రాష్ట్ర సమితి పేరుతో జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించాలని భావించిన బీఆర్ఎస్ కు వచ్చే పార్లమెంట్ ఎన్నికలు సవాల్‌గా మారుతున్నాయి. అసెంబ్లీ ఫలితాలు నిరాశకు గురిచేసినా, పార్లమెంటు ఎన్నికల్లో ఓటమిని అధిగమించేలా మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవాలన్న లక్ష్యంగా పావులు కదుపుతోన్న గులాబీ దళానికి.. అసలైన సవాళ్లు ఎదురవుతున్నాయి. అందుకే కేసీఆర్ తటస్థ ప్రముఖులపై దృష్టి సారించినట్లుగా చెబుతున్నారు. మల్కాజిగిరి నుంచి బీఆర్ఎస్ తరపున పోటీ చేయాలని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తిని కూడా పోటీ చేయాలని కోరారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో వ్యాపారవేత్తలు కూడా బీఆర్ఎస్ తరపున పోటీ చేయడానికి సిద్ధంగా ఉండరన్న వాదన వినిపిస్తోంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు విడివిడిగా జరగాలని కోరుకోవడమే బీఆర్ఎస్ పార్టీకి ముప్పుతిప్పలు తెచ్చి పెడుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన మూడు నెలలకే మళ్లీ లోక్ సభ ఎన్నికల యుద్ధం చేయాల్సి వస్తోంది. అదీ కూడా రెండు జాతీయ పార్టీలతో. లోక్ సభ ఎన్నికలంటే జాతీయ పార్టీలకు అడ్వాంటేజ్ ఉంటుంది. ఇలాంటి సమయంలో ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ.. తమకే ఓటు వేయాలని ప్రజల్ని కన్విన్స్ చేయడం అంత తేలిక కాదు. అందుకే పోటీకి అభ్యర్థులు వెనుకాడుతున్నారు. తటస్థ ప్రముఖులు కూడా బీఆర్ఎస్ వైపు చూడటం సమస్యగానే మారుతోంది. బీఆర్ఎస్‌కు గత ఎన్నికల్లో 9 లోక్ సభ సీట్లు వచ్చాయి. ఈ సారి వాటిని నిలబెట్టుకుంటే గొప్ప విజయం సాధించినట్లే. క్యాడర్ కు నైతిక బలం వస్తుంది. ఆ దిశగా కేసీఆర్ వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు. మెదక్ వంటి చోట్ల గెలుపు నల్లేరు మీద నడక అయినప్పటికీ తేలికగా తీసుకోకూడదని డిసైడయ్యారు. ప్రతీ చోటా బలమైన అభ్యర్థుల్ని రంగంలోకి దించేందుకు కసరత్తు చేస్తున్నారు. గ్రేటర్ పరిధితో పాటు నల్లగొండ, పాలమూరు వంటి చోట్ల అనూహ్యమైన అభ్యర్థులు రంగంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో పార్టీలోనే కీలకమైన, ప్రజల్లో ఉండే నేతల్ని బరిలోకి దించుతారని అంటున్నారు. ఫిబ్రవరి లోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండటంతో.. షెడ్యూల్ రాగానే అభ్యర్థుల్ని ప్రకటించే అవకాశం ఉంది.

## ఐదేళ్ల చిన్నారి గుండెపోటుతో మృతి

**అమ్రోహా :** మొబైల్ ఫోన్‌తో ఆడుకుంటూ ఐదేళ్ల చిన్నారి గుండెపోటుతో మృతి చెందింది. ఈ షాకింగ్ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లాలోని హసన్‌పూర్ కొత్వాలిలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా జిల్లాలోని హసన్‌పూర్ కొత్వాలిలో హత్తైఖేడాలో నివాసం ఉంటోన్న ఐదేళ్ల బాలిక కామిని ఆదివారం తల్లి పక్కన బెడ్‌పై పడుకుని మొబైల్ ఫోన్‌లో కార్టూన్లు చూస్తూ ఉంది. ఉన్నట్లుండి ఫోన్ చిన్నారి చేతుల్లోనుంచి జారి పోయింది. చిన్నారి తల్లి వెంటనే చూడగా అప్పటికే బాలిక అపస్మారిక స్థితిలోకి చేరుకుంది. వెంటనే కుటుంబ సభ్యులు చిన్నారిని హుటాహుటీన సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నారి గుండెపోటుతో చనిపోయి ఉండవచ్చని హసన్‌పూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ ధ్రువేంద్ర కుమార్ తెలిపారు. చిన్నారి మృతికి గల కారణాలు తెలుసుకొనేందుకు మృతదేహాన్ని పోస్ట్ మార్టం కోసం అప్పగించాలని కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేసామని, కానీ వారు అంగీకరించలేదని అమ్రోహా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యపాల్ సింగ్ అన్నారు. చిన్నారి గుండెపోటుతో చనిపోయిందా లేదా మరేదైనా వ్యాధితో చనిపోయిందా అనే అనే విషయం ఇంకా తలియరాలేదు. ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం ఇదేం మొదటిసారి కాదు. గత రెండు నెలల్లో అమ్రోహా, బిజ్నోర్ జిల్లాలలో గుండెపోటుతో డజనుకు పైగా పిల్లలు, యువకులు ఇదే విధంగా ఆకస్మికంగా మృతి చెందారు. గతేడాది డిసెంబర్ 31న అమ్రోహాలోని హసన్‌పూర్ ప్రాంతంలో క్రికెట్ ఆడుతుండగా ప్రిన్స్ కుమార్ (16) అనే యువకుడు స్పృహతప్పి పడిపోయాడు. అతన్ని వెంటనే ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ప్రకటించారు. తన కొడుకు శారీరకంగా దృఢంగా ఉన్నాడని, ఎందుకు చనిపోయాడో అర్థంకావట్లేదని మృతుడి తండ్రి రాజీవ్ సైనీ మీడియాకు తెలిపాడు. ఇక బిజ్నోర్‌కు చెందిన షిప్రా (12 ఏళ్ల) గతేడాది డిసెంబర్ 9న తరగతి గదిలోనే కుప్పకూలి చనిపోయింది. సీనియర్ వైద్యుడు డాక్టర్ రాహుల్ బిష్ణోయ్ మాట్లాడుతూ.. సాధారణంగా చల్లని వాతావరణం కారణంగా గుండెపోటు సంభవించే అవాశం ఉంది. ఆక్సిజన్ స్థాయిలు, రక్తపోటు పడిపోయి, రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతుంది. ప్రతి ఒక్కరూ చలి నుంచి తమను తాము రక్షించుకోవాలని' ఆయన అన్నారు.

## రోడ్డు భద్రతా మాసోత్సవాలు

### ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం

**ఖమ్మం :** రోడ్డు భద్రతా మాసోత్సవల్లో భాగంగా ఖమ్మం నగరంలో ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ఉల్లంఘిస్తూ నిర్లక్ష్యంగా ఆటోలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి అన్నారు. ఆటో డ్రైవర్లు, సంఘాలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని రైల్వేస్టేషన్, బస్టాండు, వైరా రోడ్డు ప్రాంతాల్లో నిత్యం ప్రయాణికులు, ఆటోలతో రద్దీగా ఉంటుందన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మితిమీరిన వేగంతో నడపవద్దన్నారు. కార్యక్రమంలో సీఐ అశోక్, ఆర్ఎస్ఐ సాగర్, ఎస్ఐ రవి పాల్గొన్నారు.

## చెల్లిపై అన్న గొడ్డలి దాడి

**ములుగు :** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేటలో దారుణం జరిగింది. దివ్యాంగురాలు అయిన చెల్లిపై అన్న గొడ్డలితో దాడి చేసాడు. ఆస్తి విషయంలో గొడవ పడి తోబుట్టిన చెల్లి పొన్నం సారక్కను హతమార్చే యత్నం అన్న పొన్నం సమ్మయ్య చేసారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సారక్కని పోలీస్ వెహికల్ లో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. ఆస్తి తగాదా విషయంలో కొద్ది రోజులుగా అన్న, చెల్లెలు మధ్య గొడవలు జరగుతున్నట్లు సమాచారం. నిందితుడు సమ్మయ్య పోలీసులు అదుపులో వున్నాడు.

## టీడీపీ నేత రంగాబాబు పై దాడి పరామర్శించిన యార్లగడ్డ

**గన్నవరం :** గన్నవరం లో టీడీపీ కి చెందిన కాసరనేని రంగబాబు పై వైసీపీ నాయకులు చేసిన దాడిని గన్నవరం టిడిపి ఇన్చార్జ్ యార్లగడ్డ వెంకట్రావు ఖండించారు. హైదరాబాద్ నుంచి నేరుగా అయన పిన్నమనేని హాస్పిటల్ కి చేరుకున్నారు. నేనున్నా మీకేం కాదు అంటూ ధైర్యం చెప్పారు. టీడీపీ కార్యకర్తలుకు నాయకులు కు ఎటువంటి ఇబ్బంది కలిగినా తెలుగు దేశం పార్టీ అండగా ఉంటుంది. రంగబాబు కి పూర్తి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. దాడికి సంబంధించిన వివరాలు పూర్తిగా అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆధారాలు ఉన్నా కూడా ఇంత వరకు నిందుతులను ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. హాస్పిటల్ లో చికిత్స పొందుతూ నన్ను ఎంత గాయపరచిన నా ప్రాణం పోయే వరకు యార్లగడ్డ వెంకట్రావు విజయం కోసం కష్టపడతా అని అవసరం అయితే వీల్ చైర్ లో కూడా తిరుగుతా అని మాజీ పి ఏ సి ఎస్ బ్యాంకు ప్రెసిడెంట్ కాసరనేని రంగబాబు తెలిపారు.

## స్కూల్ లో విద్యార్థిని మృతి బంధువుల అందోళన

**నల్గోండ :** నల్లగొండ జిల్లా, కొండమల్లేపల్లి ప్రభుత్వ గురుకుల పాఠశాల విద్యార్థిని అనుమానాస్పద మృతి పై పేరెంట్స్ విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి. ఉదయం ప్రేయర్ టైంలో 9వ తరగతి విద్యార్థిని దాసరి భార్గవి" అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోయింది. మొదట స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సీరియస్ గా ఉండడంతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపోయారు. ఆమె అప్పటికే చనిపోయిందని వైద్యులు తేల్చారు. అంగడిపేట గ్రామం, పిఏ పల్లి మండలానికి చెందిన భార్గవి.. తండ్రి ఆంజనేయులు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు వచ్చి చూసిసరికి.. కూతురు చనిపోవడం, దాని మీద అనుమానం ఉన్నదని మృతురాలి తండ్రి దాసరి ఆంజనేయులు ఆరోపించారు. తల్లిదండ్రులు కుటుంబీకులతో సహా మృతురాలికి మద్దతుగా విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగడంతో.. పోలీసులు నచ్చజెప్పి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## పోచంపల్లి హ్యాండ్లూమ్ షాపులపై విజిలెన్స్ దాడులు




**భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలో పలు హ్యాండ్లూమ్ షాప్ లపై విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. సూరత్ నుంచి ప్రింటింగ్ చీరలు తెచ్చి ఇక్కత్ చీరలుగా అమ్ముతున్నారని ఆరోపణ నేపథ్యంలో ఈదాడులు జరిగాయి. పలు షాపుల్లో నకిలీ ఇక్కత్ చీరలను స్వాధీనం చేసుకొని.. వెంటనే షాప్ యజమానులకు నోటీసులు అందించారు.

## హస్టల్ లో యువకుడు ఆత్మహత్య

**మేడ్చల్ :** సూరారం పి.యస్ పరిధిలో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సూరారం లో బాయ్స్ హాస్టల్లో ఉంటున్న మృతుడు ప్రసన్న ( 27) గా గుర్తించారు. జీడిమెట్ల పారిశ్రామిక వాడలో దినసరి కూలీ గా విధులు నిర్వహిస్తున్న ప్రసన్న ఒరిస్సా వాసి గా గుర్తించారు. రూమ్ లో ఎవ్వరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొన్న సూరారం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..

## అక్రమ నిర్మాణాల కూల్చివేతలు




**వరంగల్ :** వరంగల్ లో అక్రమ నిర్మాణాలు కూల్చివేతలు కొనసాగుతున్నాయి. జీడబ్ల్యూఎంసి అధికారులు పార్కింగ్ కు అంతరాయం కల్పిస్తున్న షాపింగ్ మాల్స్ పై కొరడా ఝలిపించారు వరంగల్ చౌరస్తాలో వర్ణం షాపింగ్ మాల్ సైన్ బోర్డ్స్, పార్కింగ్ ప్లేస్ లో వ్యాపార నిర్మాణాలు తొలగించారు. నగరంలో పార్కింగ్ కు అంతరాయం కల్పిస్తే సహించేది లేదని అధికారులు హెచ్చరించారు. అయితే ఇవన్నీ రాజకీయ కక్షసాధింపు చర్యలే నని వ్యాపారులు అరోపించారు.

## భువనగిరి మునిసిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ లపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



**భువనగిరి :** భువనగిరి మునిసిపాల్ చైర్మన్ ఆంజనేయులు, వైస్ చైర్మన్ కృష్ణయ్య మీద అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానం అనుకూలంగా.. 31 మంది మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ 16, కాంగ్రెస్ 9, బీజేపీ 6 మంది కౌన్సీలర్లు హజరయ్యారు. నలుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు.

# ఆదాయ మార్గాలు తెచ్చే వెల్త్ క్రియేటర్ల

**హైదరాబాద్ :** రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయం లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ తెలంగాణా విభాగం ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ మరింత అభివృద్ధి చెందేందుకు పలు సూచనలు, ప్రతిపాద నలను ఈ బృందం ఉప ముఖ్యమంత్రికి అందచేసింది.రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయ మార్గాలు తెచ్చే వెల్త్ క్రియేట ర్లను ఏమాత్రం ఇబ్బంది పెట్టమని, వారు ఎదుర్కుంటున్న సమస్యలను తీర్చేందుకు చర్యలు చేపడతా మని స్పష్టం చేశారు. థేమ్స్ నది మాదిరిగా మూసీ నాదీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించామని, దీనితో పాటు రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం వల్ల హైదరాబాద్ నగరం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మూసీ నది శు ద్ధితో సుందరీకరణ జరిగి, పర్యాటకం అభివృద్ధి చెందుతుం దని, మరిన్ని ఫుడ్ కోర్టులు,ఎంటర్టైన్ మెంట్ ఈవెంట్లు జరిగే అవకాశం ఉందని తద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు హైదరాబాద్ ప్రధాన శక్తి గా మారుతుందని తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మార్చడా నికి శివారు ప్రాంతాల్లో ఇండస్ట్రియల్, ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. ధరణిపై తగు సూచనలు, సలహాలను అందచేస్తే తాను పరిశీలించడంతో పాటు ధరణి పై ఏర్పాటు చేసిన కమిటీ కి అందిస్తానని భట్టి విక్రమార్క తెలిపారు. డబ్బులు కట్టి గత రెండు మూడేళ్ళుగా పెండింగ్ లో ఉన్న ఎల్.ఆర్.ఎస్. దరకాస్తులను పరిష్కరించే




విషయంలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు.కాగా, రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగ అభివృద్ధికి పలు సూచనలను నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్మెంట్ కౌన్సిల్ తెలంగాణా విభాగం ప్రతినిధి బృందం ఉప ముఖ్యమంత్రికి అందచేసింది. భవన నిర్మాణ రంగ అభివృద్ధికి 'రేరా' ఏర్పాటయినందున , భవన నిర్మాణ అనుమ తులకు ప్రస్తుతం ఉన్న 10 శాతం మార్టగేజ్ విధానాన్ని ఎత్తి వేయాలని, రాష్ట్రంలో అధికంగా ఉన్న రిజిస్ట్రేషన్ చార్జీలను తగ్గించాలని, జీ.ఓ. 50 ను ఎత్తివేయాలని సూచించారు. పెండింగ్ లో ఉన్న లక్షలాది ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, తద్వారా పెద్ద ఎత్తున నిర్మాణాలు ప్రారంభమై ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. టీ.ఎస్.బీ పాస్ క్రింద వివిధ ప్రాజెక్టులపై సమర్పించిన ధరకాస్తులు రంగారెడ్డి జిల్లాలో గత రెండేళ్లుగా పెండింగ్ లో ఉన్నాయని, దీనివల్ల ఎన్నో ప్రాజెక్టులు నిలిచి పోయా యన్నారు. రాష్ట్రంలో గత ఆరు నెలలనుండి ఎన్విరాన్ మెంట్ కమిటీ లేదని, వెంటనే ఆ కమిటీని వేయాలని కోరారు. భవన నిర్మాణాలకు తీసుకుం టున్న తాత్కాలిక విధ్యుత్ కనెక్షన్లకు యూనిట్ కు రూ.9 నుండి 14 రూపాయలకు పెంచారని దీనిని తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు

# ధరణి పోర్టల్ ప్రారంభం నుంచే అనేక లోపాలు

**హైదరాబాద్ :** వీలయినంత తొందరగానే ధరణి సమస్యలపై మధ్యంతర నివేదిక ఇస్తామని కోదండరెడ్డి నేతృత్వంలోని కమిటీ తెలిపింది. మూడోసారి సీసీఎల్ఏలో సమావేశమైన కమిటీ.. అనేక అంశాలపై చర్చించింది. ధరణి పోర్టల్ ప్రారంభం నుంచే అనేక లోపాలు ఉన్నాయని, బాధితులకు ఉపశమనం కల్పించేందుకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది. ధరణి వెబ్ సైట్ లోపభూయిష్టంగా ఉండటంతో...అనేక మంది రైతులు భూ హక్కులు కోల్పో యారని కమిటీ సభ్యులు కోదండరెడ్డి వెల్లడించారు. ఈ పోర్టల్‌లో పారదర్శకత లేదన్న ఆయన, భూమి యజమానికి తెలియకుండా లావాదేవీలు జరిగాయన్నారు. అనేక తప్పిదాల కారణంగా అన్నదాతలు... రైతుబంధు, ఇతర ప్రభుత్వ రాయి తీలను పొందలేకపోయారని స్పష్టం చేశారు. ధరణి బాధితుల కు త్వరితగతిన ఉపశమనం కల్పించేందుకు మధ్యంతర నివేదిక ఇవ్వాలని కమిటీ నిర్ణయించిందన్నారు. మరింత లోతైన అధ్యయనం చేయకుండా ముందుకు వెళ్లలేమని తెలిపారు. పోర్టల్ సమస్యలతో పాటు దానితో ముడిపడి ఉన్న అన్ని శాఖలతో చర్చించి సమగ్రమైన నివేదిక సిద్ధం చేయాల్సి ఉందని వెల్లడించింది.వాస్తవికతకు అద్దం పట్టేలా భూరికా ర్డుల కంప్యూటరైజ్డ్ చేయాల్సిన అవసరం ఉంటుందని ధరణి కమిటీ తెలిపింది. ధరణిలో ఒక సమస్యకు మరో సమస్యకు పొంతన లేకుండా ఉన్నాయని, ధరణి ప్రారంభం నుంచే అనేక లోపాలు ఉన్నాయని, ధరణి వల్ల భూ హక్కు హరించిపోయిందని చెప్పింది. రానున్న రోజుల్లో జిల్లా




కలెక్టర్లతో పాటు వ్యవసాయ, రిజిస్ట్రేషన్ శాఖలతో కూడా సమావేశమవుతామని కమిటీ తెలిపింది. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజల్లోకి వెళ్లి, సమగ్రంగా అధ్యయనం చేశాకే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని వెల్లడించింది. ధరణి వచ్చిన తర్వాత వెంటనే పనులు జరగడం బాగానే ఉన్న, పారదర్శకత కొరవడిందన్నా రున ఇదొక పెద్ద సమస్యగా పేర్కొన్న కమిటీ, మరింత లోతైన అధ్యయనం చేయాలని నిర్ణయించింది.భూములు కంప్యూట రైజ్డ్ అంటే వాస్తవికతకు అద్దం పట్టాలని, ధరణిపై చాలా కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ తెలిపిం ది. ధరణి సబ్జెక్టుపై అవగాహన కలిగిన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొంటామని, భూ యజమానికి తెలియకుండా భూ లావాదేవీలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని వెల్లడించింది. పోర్టల్ పేరు ఏదైమైనా హక్కుదారి పేరు ఆన్లైన్లో ఉంటే అతనికి చట్టం పరంగా హక్కు ఉన్నట్లేనని, ధరణి కోసం పగడ్బందీగా చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని రెండు, మూడు అంచెలుగా పూర్తి చేయాలని కమిటీ భావిస్తోంది. ధరణి పోర్టల్ వల్ల భవిష్యత్లో ఎలాంటి సమస్యలు రాకుండా, చాలా సునిశితంగా చర్చించినట్లు కమిటీ తెలిపింది. మరోవైపు భూముల వివరాలను దాచి పెట్టుకునేందుకు ధరణిలో రైట్ టు ప్రైవసీ అప్షన్ కూడా ఉంది. దీనికి సంబంధించిన బటన్ నొక్కితే సంబంధిత భూముల వివరాలు పోర్టల్‌లో సాధారణంగా కనిపించవు. సాఫ్ట్‌వేర్ నిర్వహించే వ్యక్తులు, తహసీల్దారు, రెవెన్యూ ఉన్నతాధికారులు మాత్రమే కనిపిస్తాయి. అంది కూడా లాగిన్‌లోకి వెళ్లి చూడాల్సి ఉంటుంది. ఈ తరహా వెసులుబాట్లను ఆసరాగా చేసుకొని కొందరు అక్రమాలకు పాల్పడినట్లు సర్కార్ భావిస్తోంది. హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాల్లో ప్రభుత్వ భూములు చేతులు మారాయి. ఏదో ఒక ఉత్తర్వును ఆధారంగా చేసుకొని అధికారుల సహకారంతో వారి పేరుతో ఆన్‌లైన్ చేయించుకున్నట్లు తెలుస్తోంది. ధరణిలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు జరిపిస్తామని ఇప్పటికే స్పష్టం చేసింది. ఓ జిల్లా అధికారి 89 లావాదేవీలను ఆన్‌లైన్ చేయడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. కొత్త ప్రభు త్వం అక్రమాలు జరిగినట్లుగా భావిస్తున్న సర్వే నంబర్లను ఇందులో ఉండటంతో తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం.

# పూలే విగ్రహంపై కవిత వర్సెస్ పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో పూలే విగ్రహ అంశంపై కొత్త వివాదం ప్రారంభమయింది. మొదట కవిత అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం పెట్టాలని స్పీకర్ కు వినతి పత్రం ఇచ్చారు. తర్వాత సోషల్ మీడియాలో డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంత్రి పొన్నం కవితపై విమర్శలు చేయడంతో రాజకీయం ప్రారంభమ యింది. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు భారత జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. స్పీకర్‌ను కలిసి ఎమ్మెల్సీ కవిత వినతిపత్రం అందజేశారు. జాగృతి ఆధ్వర్యంలో పోరాటం చేసి అసెంబ్లీ ప్రాంగణంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నామని, ఇప్పుడు అదే స్ఫూర్తితో పూలే విగ్రహం కోసం ఉద్యమిస్తామని చెప్పారు. ఏప్రిల్ 11న పూలే జయంతి లోపు స్పీకర్, ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నామని పేర్కొన్నారు. ఏప్రిల్ 11 వరకు రాష్ట్రవ్యాప్తంగా భారత జాగృతి ఆధ్వర్యంలో ఇతర బీసీ సంఘాల మద్దతుతో వివిధ కార్యక్రమాలు చేపడుతామని ప్రకటించారు. అసెంబ్లీ ఆవరణలో జ్యోతిరావ్ పూలే విగ్రహం ఏర్పాటు అంశంపై ఈ నెల 26న హైదరాబాద్‌లో రౌండ్‌టేబు ల్ సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్సీ కవిత ప్రకటించా రు. తెలంగాణ అసెంబ్లీలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్ర హం పెట్టాలని ఎమ్మెల్సీ కవిత చేసిన డిమాండ్ పై కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు అణగారిన జీవితాల్లో వెలుగుల దారులు పంచిన మహోన్నతుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని.. ఆ మహనీయుడి విగ్రహం అసెంబ్లీ లో ప్రతిష్టించాలని మీరు కోరడం మరీ విడ్డూరమని కవితపై మండిపడ్డారు. పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు యాదికి లేని మహాత్మా జ్యోతిరావు పూలే గారిని .మీకు ఎరుక చేసిన తెలంగాణ ఓటర్ల చైతన్యానికి వందనమని సెటైర్ వేశారు. అణచివేత కు వ్యతిరేకంగా పూలే సలిపిన పోరాటమే



మా ప్రభుత్వానికి ఆదర్శం...అందుకే మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ అని పెట్టుకున్నాం, ప్రజా పాలన అందిస్తున్నామన్నారు. మీ నియంత్రుత్వానికి ఎదురు తిరిగితే ఒక బీసీ మహిళ అని చూడకుండా జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ను ఏడిపించింది మీరు కాదా? బీసీ బిడ్డగా అడుగుతున్నా..మీ నియోజకవర్గంలో ఎంతమంది బీసీలకు మీరు బీసీ మంత్రిగా ఉన్నా..నేను ఉద్యమకారుడినే.. అణగారిన వర్గాలకు ఆప్తున్ని, సబ్బండ కులాలకు సోదరుడిని ..మీ పార్టీ అధ్యక్ష పదవి , కార్యనిర్వహాక అధ్యక్ష పదవి , లీడర్ ఆఫ్ అపొజిషన్ బీసీ లకు ఇవ్వగలరా అని ప్రశ్నించారు. పొన్నం విమర్శలపై కవిత సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే గారి విగ్రహం ఏర్పాటు చేయాలని రాజకీయాలకు అతీతంగా కోరుతుంటే ఎందుకు మీరు రాజకీయ రంగు పులుముతున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో పూలే గారి విగ్రహం ఏర్పాటు చేయడమే మీకు అభ్యంతరమా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో బడుగులకు స్థానం ఇవ్వరా ? స్ఫూర్తిదాయక వీరులకు మీరు ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే జాగృతి సంస్థ ద్వారా పోరాటం చేసి అసెంబ్లీ ఆవరణలో అంబేద్కర్ గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయించామని.. ఇప్పుడు కూడా అసెంబ్లీ ఆవరణలో పూలే గారి విగ్రహ ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా మరో పోరాటాన్ని సాగిస్తామని తెలిపారు. మహాత్మా జ్యోతిరావు పూలే మహోన్నతుడు, అణగారిన ప్రజల్లో చైతన్యం నింపిన మహా మనిషి! అందుకే ఏప్రిల్ 11 నాటికి పూలే విగ్రహాన్ని తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని భారత జాగృతి తరుపునే కాకుండా యావత్ తెలంగాణ ప్రజల తరుపున వినమ్రంగా మరోసారి కోరుతున్నానన్నారు. ఈ అంశంపై కవిత వరుస కార్యక్రమాలను ఖరారు చేసుకోవడంతో రాజకీయ వివాదంగా మారే సూచనలు కనిపిస్తున్నయి.

## మోదీ వేసిన బిగ్ బాంబ్

**హైదరాబాద్ :** ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రం మరో ముందడుగు వేసింది. కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ నేతృత్వంలో ఐదురుగు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసింది. హోం, న్యాయ, గిరిజన, సామాజిక న్యాయ శాఖల కార్యదర్శులను కమిటీలో సభ్యులుగా నియమించింది.గతేడాది డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ.. ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటిం చారు. ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన మాదిగల విశ్వరూ సభకు మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విన్నపాన్ని తెలుసుకున్న మోదీ.. తర్వాత తన ప్రసంగంలో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని, ఎస్సీల్లోని వెనుకబడిన వర్గాల ఆవేదనను అర్థం చేసుకున్నామని ప్రకటించారు. ఈ సమయంలో మంద కృష్ణ మాదిగ కంటతడి పెట్టారు. మోదీని ఆలింగనం చేసుకుని కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రకటనతో తెలంగాణలో మాదిగల ఓట్లు బీజేపీకి పోలరైజ్ అవుతాయని విశ్లేషకులు అంచనా వేశారు. కానీ, ఎన్నికల తర్వాత ఫలితాలు ఇందుకు భిన్నంగా వచ్చాయి. మోదీ ప్రకటనను మాదిగలే విశ్వసించినట్లు కనిపించలేదు. ఈ ఎన్నికల్లో బీజేపీ సింగిల్ డిజిట్‌కే పరిమితమైంది.ఇక తెలంగాణలో ఫలితాలు వ్యతిరేకంగా వచ్చాయని మోదీ ఇచ్చిన మాటను వెనక్కి తీసుకోలేదు. ఎస్సీ వర్గీకరణపై ముందుకే వెళ్లాలని నిర్ణయించారు. దేశ వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ కోసం కమిటీ వేస్తామని హైదరాబాద్‌లోనే ప్రకటించిన మోదీ.. రెండు నెలల తర్వాత జనవరి 19న కమిటీని ప్రకటించారు. కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. గతంలో సుప్రీం కోర్టు కూడా ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏడుగురు సభ్యులు రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేయాలని సూచించింది.ఇదిలా ఉండగా మరో నెల రోజుల్లో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే మోదీ మళ్లీ ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. విశ్లేషకులు కూడా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసి రెండు నెలలవుతోందని, వర్గీకరణ అంశంపై ఇన్నాళ్లూ స్పందించని మోదీ, తాజాగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే సమయంలో కమిటీ ఏర్పాటు చేయడం రాజకీయ ఎత్తుగడే అన్న చర్చ జరుగుతోంది.ఇదిలా ఉండగా ఎస్సీ వర్గీకరణ కోసం ఏర్పాటు చేసిన కమిటీ ఈనెల 22న తొలి సమావేశం. 22న అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం ఉంది. ఆరోజు చాలా మంచి రోజు కావడంతో అదే రోజు కమిటీ తొలి సమావేశం నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. తొలి భేటీలో సాధారణ అంశాలపై చర్చిస్తారని, వర్గీకరణకు మార్గదర్శకాలు రూపొందించుకుంటారని తెలుస్తోంది

## ఏకంగా బర్రెలక్కా ఎంపీగా పోటీ

**హైదరాబాద్ :** బర్రెలక్క ఈ పేరు తెలియని తెలంగాణ ప్రజలు ఉండరేమో.. ఏపీలో కూడా ఆమెకు ఫ్యాన్స్ ఉన్నారు. ఈ మధ్య జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి అందరికి షాక్ ఇచ్చింది. ఒకే ఒక్క వీడియోతో పాపులర్ అయ్యింది బర్రెలక్క. నిరుద్యోగ సమస్య కారణంగా బర్రెలు కాస్తున్నా అని వీడియో చేసి ఓవర్ నైట్ లో పాపులర్ అయ్యింది. దాంతో ఆమెకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ వచ్చింది. బర్రెలక్క అసలు పేరు కర్నె



శిరీష. డిగ్రీ పూర్తి చేసిన ఆమె ఉద్యోగం దొరక్క బర్రెలు కాస్తుంది. ఇక తన వీడియో పాపులర్ అవ్వడంతో ప్రజల సమస్యలు తీర్చడానికి అసెంబ్లీలో అడుగు పెట్టాలని నిర్ణయించుకుంది. తెలంగాణ ఎలక్షన్స్ లో కొల్లాపూర్ స్థానం నుంచి పోటీ చేసింది.బర్రెలక్క కు చాలా మంది మద్దతుగా నిలిచారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేసి. ప్రచారం కూడా ఆమె విస్తృతంగా చేసింది. కొల్లాపూర్ స్థానం నుంచి పోటీ చేసిన బర్రెలక్క ఓడిపోయింది. ఆమెకుదాదాపు 6000వేల ఓట్లు పడ్డాయి. కానీ ఆమె క్రేజ్ మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. ఎన్నికల వేళ బర్రెలక్క పేరు మరు మ్రోగింది. సోషల్ మీడియాలో లక్షల్లో ఫాలోవర్స్ పెరిగారు. చాలా మంది పెద్ద వ్యక్తులు ఆమెకు అండగా నిలిచారు. ఆమె ధైర్యాన్ని మెచ్చుకున్నారు.ఆర్థికంగానూ కొందరు సాయం చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూసిన బర్రెలక్క ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల కోసం రెడీ అవుతుందని తెలుస్తోంది. ఎలాగైనా రాజకీయాల్లో ఉండాలని ఫిక్స్ అయిన బర్రెలక్క ఇప్పుడు ఎంపీగా పోటీ చేయడానికి రెడీ అవుతుంది. ఈసారి నాగర్ కర్నూలు నుండి పోటీకి దిగుతానని బర్రెలక్క తెలిపింది. అసెంబ్లీ ఎన్నికలు నేర్పిన పాఠాలను దృష్టిలో పెట్టుకొని ఈసారి ఆచి తూచి అడుగులేస్తానని తెలిపింది బర్రెలక్క. మరి బర్రెలక్క పార్లమెంట్ ఎలక్షన్స్ లో ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి.

## విద్యార్థినికి పాము కాటు

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా వైరాలోని రాష్ట్ర సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో రాత్రి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినీ కొంగల ప్రసన్న పాము కాటుకు గురైంది. డైనింగ్ హాల్లో భోజనం చేసి వసతి భవనం వద్దకు వెళ్తున్న సమయంలో ప్రసన్నను పాము కాటు వేసింది. వెంటనే అక్కడ ఉన్న ఉపాధ్యాయినీలకు పాటు కాటు వేసిన విషయాన్ని తెలిపింది. హుటాహుటిన వైరాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. ఆనంతరం మెరుగైన వైద్యం కోసం తల్లాడ 108 వాహనంలో ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ప్రసన్న ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు.

## 3 పుస్తకాలు రాసిన 6 ఏండ్ల చిన్నారి..




ప్రధానమంత్రి జాతీయ బాలల పురస్కారం 2024కి మొత్తం 19 మంది చిన్నారులు అవార్డును అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సోమవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మొత్తం 19 మంది చిన్నారులను చిల్డ్రన్స్ అవార్డుతో సత్కరించారు.ఎంపిక చేసిన పిల్లలందరిలో ఒక పేరు మాత్రం ఎక్కువగా వినిపిస్తుంది. ఆ చిన్నారి పేరే అర్మాన్ ఉబ్రాని. ఆరేళ్ల ఆ చిన్నారి పేరు ఇప్పటికే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా నమోదు అయ్యింది. ఇంతకీ అర్మాన్ ఉబ్రాని ఎవరో ఇప్పుడు తెలుసుకుందాం.. ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ కి చెందిన చిన్నారి అర్మాన్ ఉబ్రానీ వయస్సు 6.5 సంవత్సరాలు. చిన్నారి తండ్రి వ్యాపారవేత్త కాగా తల్లి ప్లే స్కూల్ ను నడుపుతోంది. అర్మాన్ పింక్ డాల్ఫిన్, ప్లానెక్స్, మై కాంటినెంట్ ఆసియా అనే మూడు పుస్తకాలను రాశారు. ఇది మాత్రమే కాదు, తను 12 నిమిషాల 28 సెకన్లలో 100 విభిన్న సంఖ్యల సమాధానాన్ని సృష్టించారు. దీంతో ఆ చిన్నారి పేరు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు చేశారు. కళ, సంస్కృతి, ఆవిష్కరణ, క్రీడలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, ధైర్యసాహసాలు వంటి మొత్తం 6 విభాగాలలో పీఎం బాల్ పురస్కార్ ఇవ్వనున్నారు. కళ, సంస్కృతికి సంబంధించిన విభాగంలో అర్మాన్‌కు ఈ అవార్డును అందజేస్తున్నారు. బాల్ పురస్కార్ అవార్డు పొందిన 19 మంది చిన్నారులు జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొననున్నారు. జనవరి 22న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్న చిన్నారులతో జనవరి 23న ప్రధాని మోదీ సంభాషించనున్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, RNI NO: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com